# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 17 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 22 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :17 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 22 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక
- వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు

- మిగతా 2లో



## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..


### మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్

- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు

- మిగతా 2లో

## శబరిమలలో ప్రసాదం కొరత..

### హైకోర్టుకు వెళ్తానన్న మంత్రి




పెన్ పవర్ డెస్క్: సుప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదం కొరతపై కేరళం ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు మధ్య వివాదం ముదిరింది. భక్తులకు సరిపడా

- మిగతా 2లో



## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..

# టీచర్లు వర్సెస్ వైసీపీ..

### తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు ఫైర్

- విజయవాడ శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ నేతల దాడి యత్నం
- తమ నియామకాలు పారదర్శకమని చెప్పేందుకు వచ్చిన టీచర్లు.. అక్రమాలంటూ వైసీపీ నిరసన
- ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని హెచ్చరిక
- గురువులపై దాడులను సహించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరిన ముఖ్యమంత్రి

పెన్ పవర్ డెస్క్:విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడికి యత్నించారన్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి చర్యలకు పాల్పడేవారి తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. గురువులపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తీరుతామని స్పష్టం చేశారు.

**శాప్ కార్యాలయం వద్ద ఏం జరిగింది?**

మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ నేతలు కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని, తమ సర్టిఫికెట్లు, సాధించిన పతకాలు అన్నీ నిజమైనవని స్పష్టం చేసేందుకు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీలను కలిసి తమ

- మిగతా 2లో



## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

- విజయ్ పాలనపై అప్పుడే మాట్లాడటం సరికాదన్న ప్రకాశ్ రాజ్
- బీజేపీ పతనానికి సమయం ఆసన్నమయిందని వ్యాఖ్య
- తనకు కూడా మోదీనే ప్రధానమంత్రి అన్న ప్రకాశ్ రాజ్

- మిగతా 2లో

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు
- ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల
- పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు
- ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

- మిగతా 2లో

## బంగాళాఖాతంలో వాయుగుండం..

# ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండంగా బలపడే అవకాశం
- రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- పలు కోస్తాంధ్ర జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన
- లోతట్టు ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం




పెన్ పవర్ డెస్క్:బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న

- మిగతా 2లో



## చైనాకు భారత ఎగుమతులు జోరు..

### 40 శాతం వృద్ధి!

- చైనాకు భారీగా పెరిగిన భారత ఎగుమతులు
- గత ఐదు నెలల్లో దాదాపు 40 శాతం వృద్ధి నమోదు
- ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల
- ఏఐ, డేటా సెంటర్ల వల్లే డిమాండ్ పెరిగిందంటున్న నిపుణులు
- అయినప్పటికీ వాణిజ్య లోటులో పెద్దగా మార్పు లేని వైనం

పెన్ పవర్ డెస్క్:భారత్ నుంచి చైనాకు ఎగుమతులు అనూ హ్యంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో (ఏప్రిల్-ఆగస్టు) చైనాకు భారత ఎగుమ తులు సుమారు

- మిగతా 2లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

# రంగంలోకి రెవెన్యూ అధికారులు

- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన
- ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

- మిగతా 2లో



## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్



- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి

- మిగతా 2లో

## అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు..

# 28 మంది మృతి..!



పెన్ పవర్ డెస్క్:అఫ్గానిస్థాన్‌పై సోమవారం పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 28 మంది ఉగ్రవాదులు మరణించినట్లు పాక్ ప్రకటించగా.. ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గాన్ వెల్లడించింది. గత కొన్ని నెలలుగా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## డాక్టరమ్మ ఆపరేషన్ సక్సెస్ చేస్తుందా? భీమిలీ నుంచి గట్టెక్కుతారా?

భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా బొత్స అనూష ను నియమిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నియామకంజరిగినట్లు వైసీపీ నుంచి అధికారిక ప్రకటన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. భీమిలీ నియోజకవర్గ ఇన్ ఛార్జిగా... చిన్న శ్రీను పార్టీని వీడటంతో ఆయన స్థానంలో బొత్స అనూషను నియమించాలని జగన్ నిర్ణయించారు. మొన్న బొత్సతో సమావేశమై వన్ టూ వన్ చర్చించిన తర్వాత జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. భీమిలీ నియోజకవర్గం వైసీపీ ఇన్ ఛార్జిగా బొత్స అనూష వ్యవహరించనున్నారు. అయితే బొత్స అనూష ఎంపిక భీమిలి నియోజకవర్గంలో సరైన ఎంపికేనా? అన్న చర్చ జరుగుతుంది. అక్కడ బలమైన టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు ఉన్నారు. అలాంటి చోట రాజకీయ అరంగ్రేట్రం చేస్తున్న బొత్స అనూష ఏ మేరకు విజయం సాధిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీలోనే ఈ రకమైన అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**బొత్స వారసురాలిగా...**

బొత్స అనూష కాపు సామాజికవర్గం నేత కావచ్చు. బొత్స రాజకీయ వారసురాలిగా ఆమె రాజకీయ ఓనమాలు భీమిలి నుంచి నేర్చుకోవాల్సి ఉంది. తొలుత విజయనగరం జడ్పీ ఛైర్మన్ గా బొత్స అనూషను ఎంపిక చేయాలని నిర్ణయించారు. అయితే చిన్న శ్రీను పార్టీ మారిన తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో బొత్స అనూషకు భీమిలీ బాధ్యతలను అప్పగించడం సబబేనా? అన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. తొలుత గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు వంటి పేర్లను పరిశీలించినప్పటికీ వారికంటే కొత్త వారినే ఎంపిక చేయడం మంచిదని జగన్ భావించారు. అయితే భీమిలీలో కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. జనసేన, టీడీపీ కలసి ఉంటే అక్కడ నెగ్గుకు రావడం కష్టమే. ఈ పెను సవాల్ నుంచి ఈ డాక్టర్ బొత్స అనూష ఎలా బయటపడతారన్నది సందేహంగా మారింది.

**మజ్జి శ్రీనివాసరావు నిష్క్రమణతో ...**

ఇప్పటివరకు భీమిలి ఇన్ ఛార్జ్ గా ఉన్న మజ్జి శ్రీనివాసరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ పార్టీ శ్రేణులు చెల్లాచెదురు కాకుండా చూడటానికి జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరాంధ్రలో బొత్స కుటుంబానికి పట్టుంది. ఆయనకు వ్యక్తిగతంగా బలముంది. మరొకవైపు సీనియర్ నేత కావడం, కాపు సామాజికవర్గం కావడంతో ఆర్థికంగా, సామాజికవర్గం పరంగా బలంగా కనిపిస్తుంది. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల రాజకీయాల్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి గట్టి పట్టుంది. బొత్స కుటుంబానికి చెందిన వ్యక్తిని ఇక్కడ పెట్టడం వల్ల స్థానిక క్యాడర్ కూడా కదలకుండా పార్టీ వైపే ఉంటుందని అధిష్టానం భావించింది. డాక్టర్ బొత్స అనూష వైద్య విద్యను అభ్యసించి, ఇటీవలే రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నారు. మహిళా, యువ కోటాలో ఆమెను రంగంలోకి దించడం ద్వారా ప్రతిపక్ష నేత గంటా శ్రీనివాసరావును ఢీకొట్టేందుకు వైసీపీ ఒక కొత్త అస్త్రాన్ని ప్రయోగించినట్లయింది. వాస్తవానికి బొత్స అనూష విజయనగరం జిల్లా పరిషత్ పీఠంపై ఆసక్తి చూపించగా, ఆమెను భీమిలికి పంపడంపై భిన్నమైన విశ్లేషణలు వస్తున్నాయి. అయినప్పటికీ, నియామకం జరిగిన వెంటనే బొత్స అనూష తన తండ్రి బొత్స సత్యనారాయణతో కలిసి స్థానిక క్యాడర్ ను కలుపుకుంటూ భీమిలిలో పార్టీ బలోపేతానికి పూర్తి స్థాయిలో రంగంలోకి దిగారు. మరి ఈ డాక్టర్ భీమిలిలో వైసీపీని ఎలా ఆపరేషన్ చేస్తారన్నది చూడాలి.

## శబరిమలలో ప్రసాదం కొరత..

- మొదటి పేజి తరువాయి

ప్రసాదం లేకపోవడంపై కేరళం మంత్రి మురళీధరన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిర్వహణ లోపం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అవసరమైతే హైకోర్టుకు వెళ్తానని అన్నారు. ప్రసాదం కొరత ఏర్పడటంతో ఆదివారం పంపిణీని పరిమితం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి యాత్రికుడు ఒక అరవణ పాయసం, మూడు అప్పం ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చారు. ప్రసాదం కౌంటర్లను మధ్యాహ్నం 1.30కే మూసేశారు. తిరిగి 5 గంటలకు మళ్లీ తెరిచారు. దీంతో భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి.ఈ తరహా పరిస్థితులు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ఉండాలంటే.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని మంత్రి మురళీధరన్ అన్నారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తోనూ మాట్లాడి.. విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు చెప్పారు. అయితే, కన్ని నెలలో స్వామిని దర్శించుకునే భక్తుల కోసం దాదాపు 2.6 లక్షల డబ్బాల ప్రసాదాన్ని ముందే సిద్ధం చేసినట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు.గతేడాది కంటే 50 వేల డబ్బాలు అధికంగానే తయారు చేశామని, సీజను ప్రారంభం కాకముందే భక్తుల సంఖ్య పెరిగిపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. సోమవారం నాటికి కేవలం 14 వేల డబ్బాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు చెప్పారు.ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నందువల్లే కొరత ఏర్పడిందని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు చెబుతుండటంపై మంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శబరిమల యాత్ర నేపథ్యంలో.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో ముందస్తుగా ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నట్లు దేవస్థానం బోర్డు తెలిపింది.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు.సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు.ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- మొదటి పేజి తరువాయి

అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు.తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు**

కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కుప్పం దేశానికే ఆదర్శం**

"2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగాను కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

### విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..

## టీచర్లు వర్సెస్ వైసీపీ..

- మొదటి పేజి తరువాయి

గోడు వెళ్లబుచ్చుకోవాలని, వినతిపత్రం సమర్పించాలని వారు భావించారు.అయితే, అదే సమయంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శాప్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కూడా తమకు న్యాయం చేయాలని, తమపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని ప్రతి నినాదాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.

**వైసీపీపై నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు**

వైసీపీ రోజురోజుకూ మరింత దూకుడుగా, అరాచకంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "విజయవాడలో గురువుల మీద రౌడీలు దాడులు చేస్తున్నారు. దీన్ని చూస్తూ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండదు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు. విజయవాడలో సాక్షి రిపోర్టర్ ప్రమేయంతో ఒక ఉపాధ్యాయుడిపై జరిగిందని, వైసీపీ తీరు అత్యంత దారుణంగా ఉందని విమర్శించారు.సమస్యలుంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అంతేకానీ భౌతిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులపై రౌడీలను ఉసిగొల్పడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా రౌడీయిజం, అరాచకాలతో పాలన సాగిందని, కుప్పంలో తనను సైతం అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని, అక్కడ తమ వద్ద ఉన్న ఆధారాలతో వారి నోరు మూయిస్తామని సవాల్ విసిరారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ మూకలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు.తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు.రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు.

టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫకృద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు.గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు.ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

**రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (గ్రామీఖ్) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు

చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### బంగాళాఖాతంలో వాయుగుండం..

## ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- మొదటి పేజి తరువాయి

అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది.బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది.ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అఫ్ఘానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు.. 28 మంది మృతి..!

- మొదటి పేజి తరువాయి

ఈ రెండు దేశాల మధ్య జరుగుతోన్న ఘర్షణల్లో ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తాజా వైమానిక దాడులు అఫ్ఘానిస్థాన్‌లోని కునార్, పక్తికా, ఖోస్త్ ప్రావిన్సులను లక్ష్యంగా చేసుకున్నాయని కాబూల్ అధికారులు వెల్లడించారు. దాడుల్లో పలు నివాసాలు ధ్వంసమయ్యాయన్నారు.పాక్ వైమానిక దాడులను తాలిబన్ ప్రధాన ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. రోజురోజుకూ ఇస్లామాబాద్ దురాక్రమణలు పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. ఇటీవల పాక్‌లో జరిగిన పలు ఉగ్రదాడులకు ప్రతిస్పందనగా.. అఫ్గాన్‌పై దాడులు చేపడతామని ఆ దేశ సమాచార మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే దాడులు చోటుచేసుకున్నాయి.

## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

కొళత్తూరు నియోజకవర్గంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఊహించని రీతిలో పరాజయం పాలవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మార్పును ఆకాంక్షించే ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని చెప్పారు. విజయ్ ప్రభుత్వ పాలనను అప్పుడే విమర్శించడం సరికాదని... కొత్త ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయాన్నయినా ఇవ్వాలని అన్నారు. ఏడాది పాలన పూర్తయిన తాను స్పందిస్తానని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయిందని... వారి పతన సమయం ఆసన్నమైందని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించారు. త్వరలోనే వారి విధానాల తప్పులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. భవిష్యత్తులో రానున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, దీనికి ఏ పార్టీ మద్దతు ఇచ్చినా తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ తనకు వ్యక్తిగతంగా ఇష్టం లేదని, ఆయనకు తాను ఓటు వేయకపోయినా... తనకు కూడా ఆయనే ప్రధానమంత్రి అని చెప్పారు. అందుకే ప్రజా సమస్యలపై ఆయనను నిలదీసే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు.

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది.వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది.ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చైనాకు భారత ఎగుమతులు జోరు.. 40 శాతం వృద్ధి!

- మొదటి పేజి తరువాయి

40 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు ఇప్పటికీ చైనాకు అనుకూలంగా కొనసాగుతోంది.గత ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మూడు రెట్లు పెరిగి 3.18 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, డిస్‌ప్లే మాడ్యూల్స్ వంటివి వీటిలో ప్రధానమైనవి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు మధ్య కాలంలోనూ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 15 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు సైతం 21 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి.అంతర్జాతీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్ల కోసం అత్యాధునిక పరికరాలకు డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. "ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వంతో కూడిన సరఫరా వ్యవస్థలో భారత తయారీ రంగం తన విశ్వసనీయతను చాటుకుంటోంది" అని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఛైర్మన్ పంకజ్ మోహింద్రూ పేర్కొన్నారు.

అయితే, ఈ వృద్ధి స్వల్ప స్థాయి నుంచి ప్రారంభమవడంతో చైనాతో నెలకొన్న భారీ వాణిజ్య లోటుపై చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. గత ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి భారత్ దిగుమతులు 131.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం భారత ఎగుమతులకు అమెరికానే అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది.

# స్థానిక పోరుకు సై అంటే సై..!

**- మార్కాపురంలో ముదిరిన మాటల యుద్ధం..**

**- అన్నా రాంబాబు దూకుడు..కౌంటర్ గా ఎమ్మెల్యే కందుల బాంబు**

**- వైసీపీ నాయకులను ఎమ్మెల్యే ఆహ్వానంతో రాజకీయంగా హీట్**

**- ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపిన ఎమ్మెల్యే కందుల**







**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 21**

మార్కాపురం నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి ముందే రాజుకుంది. నిన్న మొన్నటి వరకు లోలోపల ఉన్న రాజకీయ వేడి ఇప్పుడు బయటకు వచ్చింది. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. శనివారం, ఆదివారం జరిగిన రెండు వేర్వేరు సమావేశాలతో రాజకీయం ఒక్కసారిగా హాట్ హాట్ గా మారింది.

**శనివారం సీన్: అన్నా రాంబాబు గర్జన - క్యాడర్ లో జోష్..**

శనివారం మార్కాపురం పట్టణ, రూరల్ మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి టౌన్, రూరల్ నుండి ముఖ్య నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తల్లో జోష్ నింపారు. గత కొంతకాలంగా నియోజకవర్గంలో టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, కేసుల పేరుతో వేధిస్తున్నారని సమావేశంలో పలువురు నాయకులు అన్నా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అన్నా రాంబాబు టీడీపీ నాయకుల దౌర్జన్యాలకు, బెదిరింపులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. నేనున్నాను. మీకు అండగా నిలబడతా. ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా నేను చూస్తూ ఊరుకోను. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మనమే విజయం సాధించాలి. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలంటూ అన్నా పిలుపునిచ్చారు. గతంలో వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఆదివారం సీన్: ఎమ్మెల్యే కందుల కౌంటర్ ఫైర్..**

అన్నా రాంబాబు సమావేశం జరిగిన మరుసటి రోజే.. ఆదివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హుటాహుటిన విలేకరుల సమావేశం పెట్టి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. అన్నా రాంబాబు చేసిన వ్యాఖ్యలకు ఆయన తీవ్రంగా స్పందించారు.

నా హయాంలోనే మార్కాపురం అభివృద్ధి చెందింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న మార్కాపురం జిల్లా సాధించింది నేనే. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మార్కాపురాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వైసీపీ హయాంలో అభివృద్ధి ఎక్కడుంది? అంతా అరాచకమే, దౌర్జన్యమే అంటూ వైసీపీ నేతలపై ధ్వజమెత్తారు. అంతేకాదు అన్నా రాంబాబుపై నేరుగా విరుచుకుపడ్డారు. అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదు. వారి హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాకే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని విమర్శించారు.

**ఎమ్మెల్యే బాంబు: వైసీపీ నేతలకు ఆహ్వానం..!**

సమావేశంలో ఎమ్మెల్యే కందుల ఒక బాంబు పేల్చారు. ఇదే ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరైనా టీడీపీలోకి రావాలనుకుంటే స్వాగతం పలుకుతాం. ఆహ్వానిస్తున్నాం. వారి పనులు కూడా చేసి పెడతాం. అభివృద్ధిలో భాగస్వాములు కావాలనుకునే వారికి టీడీపీలో ఎప్పుడూ స్థానం ఉంటుందని ప్రకటించారు. దీంతో వైసీపీలో కలకలం మొదలైంది. ఇప్పటికే పలువురు వైసీపీ నేతలు టీడీపీ వైపు చూస్తున్నారని, త్వరలో భారీ చేరికలు ఉంటాయని ఆయన సంకేతాలు ఇచ్చారు. రాబోయే మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కూటమి పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారని, అభివృద్ధిని చూసి ఓటు వేస్తారని ఆయన తెలిపారు.

**ఎన్నికల వేళ మాజీ ఎమ్మెల్యే, తాజా ఎమ్మెల్యే లెక్కేంటి..?**

ఒకవైపు వైసీపీ కేడర్ లో ధైర్యం నింపేందుకు అన్నా రాంబాబు ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఎమ్మెల్యే కందుల ఆపరేషన్ ఆకర్ష్ తో వైసీపీని ఖాళీ చేసే వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. ఎన్నికలకు ముందే ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం ముదరడంతో మార్కాపురం పాలిటిక్స్ లో ఇక రోజుకో ట్విస్ట్ ఖాయంగా కనిపిస్తోంది. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఈ పోరు మరింత ముదిరే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పెన్ పవర్

## మార్కాపురం - ప్రకాశం

# వైసీపీ ద్రోహుల వల్లే మున్సిపల్ ఎన్నికలకు గ్రహణం

**-అభివృద్ధిని అడ్డుకోవడానికి తెరచాటు ప్రయత్నాలు**

**-కుట్రలను ఛేదించి... ఎన్నికలు జరుపుతాం**

**-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**

**-అర్బన్ పరిధిలో 152 మందికి గృహనిర్మాణ అనుమతి పత్రాలు పంపిణీ**

**-కూటమి ప్రభుత్వానికి లబ్ధిదారుల కృతజ్ఞతలు**






**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 21**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన -2 పథకం ద్వారా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో సొంత స్థలాలు కలిగిన 152 మందికి ఇళ్ళు నిర్మించుకునేందుకు అనుమతి రాగా.... వారందరికీ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అనుమతి పత్రాలు అందజేశారు. గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో, కందుకూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో... సంబంధిత శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి. శ్రీనివాస ప్రసాద్ సహా పలువురు అధికారులు, టిడిపి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన మహిళలు... తమ కుటుంబాలతో సహా వచ్చి ఎమ్మెల్యే నాగేశ్వరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయా కుటుంబాల ఆనందోత్సాహాల మధ్య, పండుగ వాతావరణంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి లబ్ధిదారులకు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరావు మాట్లాడుతూ వైసీపీ ద్రోహులైన కొందరు, తెరచాటు కుట్రలతో కేసులు వేసి మున్సిపల్ ఎన్నికలు జరగకుండా చేశారు. దానివల్ల ప్రతి ఏటా రావాల్సిన 5 కోట్లు నిధులు ఆగిపోయాయి. అభివృద్ధిని అడ్డుకోవాలన్న లక్ష్యం వారిది. వారి కుట్రలను ఛేదించి మున్సిపల్ ఎన్నికలు జరిపే బాధ్యత నాది అని అన్నారు. గత ప్రభుత్వంలో వైసిపి నేతలు వేలకోట్లు దోచుకుని, పట్టణాలకు దూరంగా జగనన్న కాలనీలు ఏర్పాటుచేశారు. కందుకూరు పరిధిలోని విక్కిరాలపేట రోడ్డులో కాలనీ, చిల్లచెట్ల వనంగా మారింది. సొంత స్థలాలు ఉన్నవారికి ఇళ్ళు కట్టుకునే అవకాశం జగన్ ప్రభుత్వం ఇవ్వలేదు. ట్రాక్టర్ ఇసుకకు 5 వేలు చెల్లించాల్సి వచ్చిందని ఎమ్మెల్యే విమర్శించారు. పేదల సొంతింటికల నిజం చేయాలన్నదే చంద్రబాబు ఆలోచన. కందుకూరు అర్బన్ పరిధిలో మొదటి విడతగా 417 మందికి, రెండవ విడతలో ప్రస్తుతం 152 మందికి ఇళ్లు కట్టుకునేందుకు శాంక్షన్ వచ్చింది. గత ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి 1.80 లక్షల మాత్రమే కేటాయించింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఒక లక్ష, కేంద్ర ప్రభుత్వం ఒకటిన్నర లక్ష కలిపి మొత్తం 2.5 లక్షలు అందుతాయి. మండలాల పరిధిలో 2.89 లక్షలు ఇస్తారు. ప్రస్తుతం ఇసుక ఉచితంగా అందుతోంది. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ చక్కగా సొంతిల్లు నిర్మించుకొని ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాను అని నాగేశ్వరరావు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 50 కోట్లతో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, రోడ్ల వెడల్పు కార్యక్రమం వేగంగా జరుగుతోంది. 50 ఏళ్ల క్రితం ఇటుకలతో కట్టిన డ్రైనేజీల స్థానంలో, కాంక్రీట్ కాలువలు నిర్మించేందుకు 25 కోట్లు రాబోతున్నాయి. కందుకూరు అభివృద్ధికి మంచి మనసుతో సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కి ప్రత్యేక కృతజ్ఞతలు అని నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ మాధవరావు, డిఈ నారాయణరెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, షేక్ రఫీ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, క్లస్టర్ ఇంచార్జ్ వడ్డేళ్ల రవిచంద్ర, హౌసింగ్ అర్బన్ ఏఈ షేక్ గౌస్ బాషా, మండలాల ఏఈలు, పాల్గొన్నారు.


# స్వర్ణ కొమరోలు 2 నూతన భవనాన్ని ప్రారంభించిన గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

**ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు**



**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 21**

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, పరిపాలనను సులభతరం చేయటం లక్ష్యంగా సచివాలయ వ్యవస్థ పనిచేస్తుందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కొమరోలు మండలంలో సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో గిద్దలూరు నుంచి కొమరోలు చేరుకున్న శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు అభిమానులు షిరిడి సాయిబాబా ఆలయం వద్ద ఘన స్వాగతం పలికి మేళతాళాలతో, పూల వర్షం కురిపిస్తూ స్వర్ణ కొమరోలు 2 భవనం వద్దకు ర్యాలీగా తరలించారు. ఆ సందర్భంగా అశోక రెడ్డి ముందుగా శిలాఫలకానికి, ఆ తరువాత నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,, ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడం., పరిపాలనను మరింత సులభసరం చేయటం వలన ప్రజలకు ఎంతో సౌకర్యాలు కలుగుతాయని ఆయన తెలిపారు. అధికారులు కూడా స్వర్ణ కొమరోలు నూతన భవనాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నదని పేర్కొన్నారు. ప్రజలు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఎప్పుడు ఎలాంటి ఎన్నికలు వచ్చినా ప్రజలు కూటమి ప్రభుత్వ పక్షాన నిలబడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని పార్టీని ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఆ కార్యక్రమంలో ముత్తుముల సంజీవరెడ్డి, బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తెలుగుదేశం పార్టీ నేతలు వీరం రెడ్డి శంకర్ రెడ్డి, రఘురామిరెడ్డి, ఇడమకలు సహకార సంఘం చైర్ పర్సన్ బిజ్జం రవీంద్రారెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడీ ఓబుల్ రెడ్డి, డైరెక్టర్లు షేక్ హసీనా, బిజ్జాల తిరుమలరెడ్డి, గజ్జలకొండ నారాయణ, కొమరోలు మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ ఖాదర్, కొమరోలు సహకార సంఘం మాజీ చైర్మన్ పులకుర్తి వెంకటేశ్వర్లు, కొమరోలు మాజీ వార్డ్ మెంబర్ షేక్ సుభాని, క్లస్టర్ ఇన్చార్జీలు పందన బోయిన భూపాల్, ముత్తెముల ఎల్లారెడ్డి, పులకుర్తి సుబ్బరాయుడు, తెలుగుదేశం పార్టీ నేతలు మల్లికార్జున్ రెడ్డి, ఖాజావలి, కరీముల్లా, పేరాల లక్ష్మీనరసయ్య, పెనుగొండ వెంకటరమణ, ఎర్రగుంట్ల రామస్వామి, తదితర నేతలు కార్యకర్తలతో పాటు కొమరోలు ఎంపీడీవో రమేష్ బాబు, మండల పరిషత్ ఏఓ సయ్యద్ కలిముల్లా ఖాద్రిడిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీరాజ్ డిఇ సుబ్బారెడ్డి, ఏఈ ఈరయ్య, ఏపిఎం, ఏపీవో హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, విద్యుత్ శాఖ ఈ శ్రీనివాసులు, కొమరోలు పంచాయితీ అభివృద్ధి అధికారిని వై గీత, స్వర్ణ కొమరోలు కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి, తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కొమరోలు మండల పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.



## యువత బంగారు భవిత కోసం కూటమి ప్రభుత్వం

# అంకిత భావంతో పని చేస్తోంది

**మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి - మీ భవిష్యత్తు కు మా భరోసా - ఎమ్మెల్యే దామచర్ల**

**ఒంగోలులో హర్షిణి డిగ్రీ కాలేజి, దామచర్ల సక్కుబాయమ్మ మహిళా డిగ్రీ కాలేజిలో యువత .. భవిత కార్యక్రమం**




**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

రాష్ట్రంలోని యువత బంగారు భవిత కోసం కూటమి ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం ఒంగోలులోని హర్షిని డిగ్రీ కాలేజ్, దామచర్ల సక్కుబాయమ్మ మహిళా డిగ్రీ కాలేజీలో జరిగిన యువత భవిత కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిలతో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...రాష్ట్రంలోని యువత బంగారు భవిత కోసం కూటమి ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోందని అన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తున్నాం. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ శ్రమిస్తున్నారని చెప్పారు. ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్స్, పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. కౌశలం ద్వారా నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వర్క్ ఫ్రమ్ హోం అవకాశాలు కల్పిస్తున్నాం. వైసీపీ హయాంలోనే గ్రూప్ 1 ఉద్యోగాల్లో అక్రమాలకు పాల్పడ్డారు. జగన్ అండ్ కో గ్రూప్ 1 ఉద్యోగాల్లో అక్రమాలకు పాల్పడి రూ. 150 కోట్లు కొల్లగొట్టారు. మేం మెగా డిఎస్సితో పారదర్శకంగా 16 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అన్నారు. అది ఓర్వలేకనే వైసిపి తప్పుడు ప్రచారాలు. స్పోర్ట్స్ కోటాలో ప్రతిభ గల క్రీడాకారులకు పారదర్శకంగా ఉద్యోగాలు ఇచ్చామని, ఇందులో ఎలాంటి అక్రమాలు లేవని, ఎక్కడైనా తప్పు జరిగినట్లు నిరూపించమని



టీచర్లు సవాల్ విసిరితే వైసీపీతోక ముడిచి సిగ్గు లేకుండా ఇంకా తప్పుడు ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. రౌడీ షీటర్లు, గంజాయి బ్యాచ్ తో టీచర్లపై వైసీపీ అల్లరి మూకల దాడులు దుర్మార్గం అని, సమాజంలో తప్పుడు ప్రచారాలు చేస్తూ అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ ఫేక్ పార్టీ, వైసీపీ అసత్య ప్రచారాలు యువత నమ్మొద్దని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టార్జితాన్ని అర్థం చేసుకొని మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకునే విధంగా చదువులో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. మీ బంగారు భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం భరోసాగా ఉంటుందని విద్యార్థులకు స్పష్టం చేశారు. ఉన్నత విద్య అయిపోయిన వెంటనే కూటమి ప్రభుత్వం అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు 20 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 7 లక్షల మందికి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 32 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని గుర్తు చేశారు. ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు దామచర్ల గుర్తు చేశారు. శ్రీ హర్షిని విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ టెక్నాలజీ రంగాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని తెలిపారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే డీఎస్సీ నిర్వహించారని, ప్రస్తుత ఉన్న ఉపాధ్యాయులు 80% పైగా చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఉద్యోగ అవకాశాలు పొందిన విషయాన్ని రవికుమార్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ హర్షిత్ డీన్ దాది ఆంజనేయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




# జయహో గురజాడ.. నేటి తరానికి నీమాట అడుగుజాడ...

## నాటి సమాజంలో దురాచారాలను రూపుమాపడం కోసం కవిత్వాన్ని బలమైన ఆయుధంగా నమ్మిన సంఘసంస్కర్త... "గురజాడ"..

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 21**

ఆనాటి సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలను రూపుమాపేందుకు, ప్రజలను చైతన్య పరిచేందుకు తన రచన ద్వారా అవిరళ కృషిచేసిన నవయుగ వైతాళికుడు... "గురజాడ" యని జేవివి రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి పేర్కొన్నారు సోమవారం జనవిజ్ఞాన వేదికలో జరిగిన కార్యక్రమంలో స్వరూపరెడ్డి ముఖ్యవక్తగాపాల్గొని ప్రసంగించారు. ఆడపిల్ల దేశానికి గర్వ కారణము. ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుందని చెప్పిన ధార్శనికుడు.. "గురజాడ"అన్నారు. పరీక్షా విధానము విద్యార్థులను మానసిక శ్రమకు గురి చేస్తూ, జ్ఞాన పరీక్ష నుండి జ్ఞాపక పరీక్షగా మారుతుందనే ఆనాడే చెప్పిన అభ్యుదయ కవితా పితామహుడు "గురజాడ". అని ప్రజల కోసం వాడుక భాషను ప్రగతిశీల భావాలతో ముందుకు తీసుకెళ్లిన మహాకవి "గురజాడ". అన్నారు, పండితులకు అర్థమయ్యే గ్రాంధికము సామాన్యులకు అక్కరకు రాదని తేల్చేసిన భాషాభిమాని, కవిశ్టఖరుడు "గురజాడ".... దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా వొట్టి మాటలు కట్టిపెట్టవోయ్ గట్టిమేల్ తలపెట్టవోయ్. అని చాటి చెబుతూ గురజాడ రచించిన దేశభక్తి గీతాన్ని ఇప్పటికీ తెలుగువారి గళం గానం చేస్తూనే ఉంది.ఆయన రాసిన కన్యాశుల్కం నాటకంలోని పాత్రల మాటలు తెలుగువారి నోట పలుకుబడులై నిలిచే ఉన్నాయన్నారు. గురజాడ రచనల్లో కన్యాశుల్కం (నాటకం) అగ్రగణ్యమైనదని. కన్యాశుల్కం దురాచారాన్ని విమర్శిస్తూ గురజాడ రచించిన ఈ నాటకం భారతీయ భాషల్లో వెలువడిన ఉత్తమోత్తమమైన రచనలలో ఒకటి. వాడుక భాషలో, విజయనగర ప్రాంత యాసలో రాసిన ఈ నాటకం ఈనాటికీ పాఠకులను అలరిస్తూ ఉందన్నారు. నవయుగ కవితావైతాళికుడు గిడుగు రామ్మూర్తి పంతులుకు మెట్రిక్యులేషనలో క్లాస్‌మేట్ అయిన గురజాడ అప్పారావు కందుకూరి వీరేశలింగం పంతులు లోని సంఘ సంస్కరణ, గిడుగులోని భాషా సంస్కరణలు తీసుకుని రెండింటినీ మేళవించి ఒక సాంఘిక విప్లవం తీసుకువచ్చారని.మనలోని ఆంగ్లభాషా వ్యామోహాన్ని ఎత్తి చూపుతూ, మాతృభాషలో విద్యా బోధన సాగాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతారు గురజాడ. గురజాడ విద్యార్థి దశలోనే తెలుగు, ఆంగ్లంలో కవితలు రాశారన్నారు. ఆంగ్లేయుల వలె తాను కంటికి కనిపించినదే నమ్ముతానని,ఊహాజనితాలకు తావివ్వనని ప్రకటించారన్నారు. సాహిత్యానికి ఒక కొత్త ఒరవడి సృష్టిస్తూ 'దేశమంటే మట్టి కాదోయ్, దేశ మంటే మనుషులోయ్' అని తన దేశభక్తి గీతంలో సమాజానికి ప్రబోధించారు.'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ,దిద్దుబాటు వంటి




రచనలు ఆయన చేసారు.స్త్రీ విద్య ఆవశ్యకతను ఏనాడో చాటి చెప్పిన గురజాడ స్త్రీలు విద్యావంతులు కావాలని, వంట గదిని దాటి బయటకు రావాలని, ఉత్పత్తిలో వారు కూడా భాగస్వాములైన నాడే ఈ సమాజం అభివృద్ధి చెందుతుందని చాటి చెప్పారు గురజాడ. స్త్రీలు ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలు నేర్చుకోవాలని ఆనాడే చెప్పారన్నారు. ప్రజల భాషకు పట్టం కట్టిన ప్రజాకవి గురజాడ. 1862 సెప్టెంబర్ 21న జన్మించిన గురజాడ 1915 నవంబర్30న తుదిశ్వాస విడిచారు. తెలుగు సమాజం మూఢాచారాల లో మూఢవిశ్వాసాలలో మగ్గుతున్నప్పుడు తన రచనల ద్వారా భావ ప్రచారం చేసి సమాజాన్ని చీకట్లో నుంచి వెలుగులోకి నడిపించిన ఆధునిక వైతాళికుడు గురజాడ అప్పారావు తెలుగు సమాజాన్ని భయము నుండి మౌఢ్యము నుండి వివక్ష నుండి విముక్తి చేయడానికి సాహిత్యాన్ని సాధనంగా ఉపయోగించారు మనిషిని భయములో అజ్ఞానంలో ముంచివేస మతము నుండి సమాజం బయటపడి జ్ఞానవంతము కావాలని గురజాడ ఆకాంక్షించారు మతములన్నియు మాసిపోవును జ్ఞానం ఒక్కటే నిలిచి వెలుగును అని చెప్పిన మహానుభావుడు గురజాడ ఊహల నుండి అద్భుతాల నుండి అతేంద్రియ శక్తుల నుండి సాహిత్యాన్ని ముందుగా విముక్తి చేసి వాస్తవికతతో నింపారు మనిషిని వాస్తవంగా గుర్తించి మనిషిని చరిత్ర నిర్మాతగా గుర్తించి మనిషికి పట్టం కట్టారని, మానవుల కష్టసుఖాలకు సాటి మనసులే కారణమని మానవేతర శక్తుల ప్రమేయం ఉండదన్నారు గురజాడ తన కాలము నాటికి గురజాడ వందేళ్లు ముందున్నాడు ఆయన శాస్త్రీయ చింతనకు ప్రతినిధి అని ప్రజలు గురజాడము చదివితే పోయేది ఏమీ లేదని మన బుర్రకు పట్టిన అశాస్త్రీయ బూజు పోతుంది అన్నారు.



# అశోక్ క్వాలిటీ స్వీట్ షాపును ప్రారంభించిన దివి రవీంద్రనాథ్





**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 21**

పట్టణంలోని పోస్టు ఆఫీస్ సెంటర్ లో గల శ్రీ రంగా కాంప్లెక్స్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన అశోక్ క్వాలిటీ స్వీట్ షాపును సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు దివి రవీంద్రనాథ్ ప్రారంభించారు. ముందుగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం స్వీట్ షాపు యాజమాన్యం అంబటి శ్రీనివాసరావు , శారద , విష్ణువర్ధన్ , అశోక్ వారి కుటుంబ సభ్యులు దివి రవీంద్రనాథ్ కు సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించి పూల బొకే అందించారు. ఈ సందర్భంగా దివి రవీంద్రనాథ్ మాట్లాడుతూ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు చేసే వ్యాపారంలో దినదినాభివృద్ధి చెందాలని తద్వారా ఆర్థికంగా బలోపేతమై పేద ప్రజలకు సేవ చేసే భాగ్యం ఆ భగవంతుడు ప్రసాదించాలని ఆశీర్వదించాడు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం మాజీ సర్పంచ్ బైరపనేని కోటయ్య , ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , కందుకూరు నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు మోదడుగు వెంకటేశ్వర్లు, కందుకూరు నియోజకవర్గం తెలుగురైతు కమిటీ ఉపాధ్యక్షులు గళ్ళా హరిబాబు , శివాలయం మాజీ చైర్మన్ సీతిరాళ్ళ గోపాల్ , టిడిపి కార్యకర్తల శిక్షణ శిబిరం మాజీ కో – ఆర్డినేటర్ కాకర్ల మల్లికార్జున రావు , దివి తిరుపతి నాయుడు , గళ్ళా రాధాకృష్ణ , షేక్ ఖాదర్ వలీ , బత్తిని మాల్యాద్రి , రావూరి రామకోటయ్య , ముప్పరాజు శ్రీహరి , కందుకూరు నియోజకవర్గం తెలుగురైతు కమిటీ మీడియా కో – ఆర్డినేటర్ దివి శ్రీధర్ బాబు , తలపనేని నరసింహారావు, నల్లూరి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో విజయానికి వినాయకుని గుణాలే మార్గదర్శకం

**-డా. కె. విజయ్ శ్రీనివాస్**





**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 21**

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో వినాయక నిమజ్జన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భక్తి గీతాలు, సాంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ వినాయకుని జ్ఞానం, వినయం, క్రమశిక్షణ, పట్టుదల వంటి గుణాలను ప్రతి విద్యార్థి జీవితంలో ఆచరిస్తే విజయాన్ని సాధించగలరని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. చి. హెచ్. రవి కుమార్ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి. హరి బాబు, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం భక్తి పారవశ్యంలో గణనాథుడికి ఘనంగా నిమజ్జనం నిర్వహించారు.

# విద్యా కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 22**

మండలంలోని ముండ్లపాడు ప్రాథమిక పాఠశాల పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా గత రెండు సంవత్సరాలుగా సేవలందించిన తోట నారాయణ స్వామి పదవీకాలం ముగిసిన సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె చెన్నయ్య అధ్యక్షత న ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె చెన్నయ్య మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాలంలో తోట నారాయణ స్వామి పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది కొనియాడారు.ముఖ్యంగా విద్యార్థుల సౌకర్యార్థం దాతల సహకారంతో వాటర్ ఫ్రీజర్, స్టేషనరీ, నోట్‌బుక్స్ తదితర సామగ్రిని సమకూర్చడంతో పాటు, పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం గ్రామస్థులు, దాతలను సమన్వయం చేస్తూ చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తోట నారాయణ స్వామిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించి, ఆయన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డించే అన్నం వడ్డేవారికి, పాఠశాల ఆయాకు సన్మానం చేసి వారి సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాలకొండారెడ్డి, చెన్నారెడ్డి, పుల్లారెడ్డి, దర్శి రాజా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. చెన్నయ్య, సిబ్బంది గాంధీ, ఎల్. ఆంథోనీ, హమ్మద్, లక్ష్మణ్, ప్రసాద్, సిఆర్పి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పరిశీలించిన ఎంపీడీవో మూర్తి

**త్రిపురాంతకం పెన్ పవర్ సెప్టెంబర్ 21**

త్రిపురాంతకం మండల పరిధిలోని త్రిపురాంతకం స్వర్ణ గ్రామ కార్యాలయ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో మూర్తి, పంచాయతీ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులతో ఎంపీడీవో నేరుగా మాట్లాడి, పింఛన్ల అందజేత తీరును మరియు వారి అర్హత వివరాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మూర్తి మాట్లాడుతూప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో, సంపూర్ణ పారదర్శకతతో అందాలన్నదే తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పింఛన్ల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా, నిజమైన లబ్ధిదారులకు పథకం లబ్ధి నిరంతరం అందేలా చూసేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ముఖ్య అంశాలు:** నేరుగా విచారణ: లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడి, పింఛన్ సకాలంలో అందుతోందో లేదో అడిగి తెలుసుకున్నారు.

**పత్రాల పరిశీలన:** లబ్ధిదారుల వయస్సు, ఆదాయ పరిమితి, వికలాంగత్వ ధృవీకరణ పత్రాలు మరియు ఇతర రికార్డులను సిబ్బంది



క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**సిబ్బందికి సూచనలు:** సాంకేతిక కారణాల వల్ల లేదా పత్రాల సమస్యల వల్ల పింఛన్లలో జాప్యం జరిగితే, వెంటనే స్పందించి పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు మరియు సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు స్థానిక లబ్ధిదారులు పాల్గొన్నారు.

# యువతలో హెచ్ఐవి/ఎయిడ్స్ పట్ల అవగాహనను పెంపొందించాలి

**- జిల్లా లెప్రసి ఎయిడ్స్ టి బి అధికారి డాక్టర్ జి బాలాజీ - జిల్లా స్థాయి క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందజేత**




**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

యువతకు హెచ్ఐవి/ఎయిడ్స్‌పై సరైన అవగాహన కల్పించడం ద్వారా అపోహలను తొలగించి, వ్యాధి నివారణకు సమాజంలో చైతన్యం తీసుకురావచ్చని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంతో పాటు, హెచ్ఐవి/ఎయిడ్స్‌పై శాస్త్రీయ అవగాహనను ఇతరులకు కూడా కల్పించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ జి. బాలాజీ సూచించారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు, ప్రకాశం జిల్లా కలెక్టర్ సూచనలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, రెడ్ రిబ్బన్ క్లబ్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో యువతలో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయి క్విజ్ పోటీని సోమవారం పివిఆర్ ప్రభుత్వ బాలుర కళాశాలలో నిర్వహించారు.ఈ క్విజ్ పోటీలో జిల్లా స్థాయి నుంచి మొత్తం 14 టీమ్‌లు పాల్గొని, హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, వ్యాప్తి, చికిత్స, అపోహలు, యువత ఆరోగ్యం తదితర అంశాలపై క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీలో ప్రథమ బహుమతి రూ.5,000/-లును, ఎస్పీసిఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, టంగుటూరు విద్యార్థులు, ద్వితీయ బహుమతి రూ.4,000/-లను జిల్లా పరిషత్ హైస్కూల్, చాకిచెర్ల విద్యార్థులు,తృతీయ బహుమతి రూ.3,000/ -లను ప్రభుత్వ జూనియర్ కళాశాల, సింగరాయకొండ విద్యార్థులు సాధించారు. కన్సొలేషన్ బహుమతి రూ.2,000/-లను సెయింట్ జేవియర్ స్కూల్, ఒంగోలు విద్యార్థులు పొందారు. విజేతలకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ జి. బాలాజీ చేతుల మీదుగా పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్, నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అమీన్ సాహెబ్, పి. కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్. సాయి, కొలకలూరి ఆలీ బాబు, గాలి స్వరూప్ కుమార్, షేక్ . పీర్ భాష, పి. వెంకటేశ్వర్లు, బి . దుర్గా సురేంద్ర,సి. హెచ్. క్రాంతి కుమార్, లింక్ వర్కర్స్ ఔట్రీచ్ వర్కర్స్ పాల్గొన్నారు.

# యుద్ధం వద్దు -శాంతి ముద్దు



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 21)**

గిద్దలూరు పట్టణం లోని రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆవరణలో నేడు ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా సభ జరిగింది.ఆదర్శ పౌరుల నిర్మాణ సంస్థ అధ్యక్షులు రెడ్డి మల్లా రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిధులుగా విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి. రవీంద్రనాథ్ రెడ్డి, నేషనల్ ఎన్ జీ ఓ క్లబ్ రాష్ట్ర అధ్యక్షులు కోడూరి వెంకటేశ్వర రావు పాల్గొని మాట్లాడుతూ నేటి ప్రపంచానికి శాంతి ఎంతో అవసరమని, యుద్ధాల వల్ల నష్టం తప్ప ప్రయోజనం లేదని, ప్రపంచ శాంతి కోసం మనమంతా ఒక్కటిగా నిలబడాలని కోరారు. రెడ్డి మల్లా రెడ్డి, ఎమ్ రంగయ్య మాట్లాడుతూ యుద్ధం వద్దు, శాంతి ముద్దు అని పిలుపునిచ్చారు. ప్రపంచంలో శాంతి నెలకొనాలంటే ప్రతీ ఒక్కరిలో మానవత్వం, సహనం, ప్రేమ పెరగాలని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమం లో విశ్రాంత ఉద్యోగులు, పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఎస్సి ,ఎస్టీ ,బిసి ఓటర్ల జాబితా విడుదల

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 21**

గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలోని 1 నుండి 28 వార్డులకు సంబంధించి ఎస్సి, ఎస్టీ మహిళా ఓటర్లు బిసి ఓటర్ల వివరాలతో కూడిన ఓటర్ల జాబితాను ఫారం-1 నందు 14 సెప్టెంబర్ 2026 న ప్రచురించడమైనది . ప్రజలు తమ వివరాలను పరిశీలించేందుకు ,ఏవైనా క్లెయిమ్‌లు లేదా అభ్యంతరాలు ఉంటే సమర్పించేందుకు 17 సెప్టెంబర్ 2026 వరకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సర్క్యులర్ ప్రకరశీ గడువు ఇవ్వడం జరిగింది. ఫారం-1ను ప్రజల పరిశీలన కోసం గిద్దలూరు మండల తహసీల్దార్ కార్యాలయం, గిద్దలూరు పురపాలక కార్యాలయంలో అందుబాటులో ఉంచడం జరిగింద ని మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా ఫారం-2, ఫారం-3 ఎటువంటి క్లెయిమ్‌లు లేదా అభ్యంతరాలు అందనందున గిద్దలూరు పురపాలక సంఘంలోని 1 నుండి 28 వార్డులకు సంబంధించిన ఎస్సి, ఎస్టి మహిళా ఓటర్లు ,బిసి ఓటర్ల తుది జాబితాను ఈ 21 సెప్టెంబర్ 2026 న ఫారం-6 నందు గిద్దలూరు మండల తహసీల్దార్ కార్యాలయం , గిద్దలూరు పురపాలక కార్యాలయంలో ప్రచురించామని కమీషనర్ రమణ బాబు తెలిపారు.



# కోటిన్నర రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన మూడు సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

## కొమరోలు మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత

## ప్రజలు తనను తమ బిడ్డగా భావించి అన్నివేళలా సహాయ సహకారాలు ఆశీస్సులు అందిస్తూ ఉండాలని విజ్ఞప్తి





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 22**

కొమరోలు లోని పలు వీధులలో 1,44 కోట్ల రూపాయలతో నూతనంగా నేర్పించిన మూడు సిమెంట్ రోడ్లకు సోమవారం గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేసే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం కొమరోలు వచ్చిన గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, కొమరోలు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కార్యకర్తలు మేళ తాళాలు, బాణసంచా కాల్పులతో, పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ముత్తుముల అశోక్ రెడ్డి మొదట స్వర్ణ కొమరోలు 2 నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం మీదుగా గోపాని పల్లెలోని బీసీ హాస్టల్ వరకు 74 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రింగ్ రోడ్డుకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఎంపీడీవో కార్యాలయం వెనుక ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం కడప అమరావతి జాతీయ రహదారి వద్ద నుంచి కొమరోలు తాతిరెడ్డిపల్లి రోడ్డు లోని కొమరోలు లోని శివాజీ నగర్ మీదుగా 40 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డుకు కూడా ఆయన ప్రారంభోత్సవం చేశారు, ఆ సందర్భంగా అమరావతి కడప జాతీయ రహదారి కూడలిలో ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం కొమరోలు లోని ఇస్లాంపేటలో గల గుట్ట వద్ద నుంచి సర్వే రెడ్డి పల్లె రోడ్డు లో 30 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డుకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. గుట్ట వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆయన అక్కడి తరలివచ్చిన మహిళల హర్షధ్వానాల మధ్య శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఒకవైపు ఎండ తీవ్రత అధికంగా ఉంటున్నప్పటికీ కొమరోలు లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి కడప అమరావతి జాతీయ రహదారి నీ క్రాస్ చేసి ఆరె మరాఠీ కాలనీ శివాజీ నగర్ సినిమా హాలు వెనుక వీధుల మీదుగా ఇస్లాం పేటను గుట్ట వరకు తెలుగుదేశం,జనసేన, బిజెపి పార్టీల నేతలు కార్యకర్తలు అభిమానులతో పాదయాత్ర సాగించారు.ఆ సందర్భంగా దారి పొడుగునా ప్రజలకు అభివాదం చేస్తూ వారిని ఆప్యాయతగా పలకరిస్తూ,వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందు సాగారు. మూడు చోట్ల జరిగిన శిలాఫలకాల ఆవిష్కరణ సందర్భంగా నేతలు కార్యకర్తలు అభిమానులను పేరుపేరునా పిలుస్తూ వారితో కొబ్బరికాయలు కొట్టించడంతో నేతలు కార్యకర్తలు అభిమానులు పులకించిపోయారు. శిలాఫలకాల ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థికంగా ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు మిగిలిన హామీలన్నింటిని దశలవారీగా అమలు చేస్తూ ప్రజలకు ప్రజా రంజకమైన పాలన అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే తాను కూడా గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కృషి చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు.గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాలలో తన సొంత మండలమైన కొమరోలు మండలం పైనే తనకు ఎక్కువ ప్రేమ మమకారాలు ఉన్నాయని అందువల్ల కొమరోలు మండల అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఎలాంటి ఎన్నికలు వచ్చినా ప్రజలు కూటమి ప్రభుత్వానికి,తనకు తమ వంతు సహాయ సహకారాలు ఆశీస్సులు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ కార్యక్రమంలో కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, కొమరోలు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, కొమరోలు మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ ఖాదర్, తెలుగుదేశం పార్టీ నేతలు వీరం రెడ్డి శంకర్ రెడ్డి,వీరం రెడ్డి రఘురామిరెడ్డి, ఎడమకలు సహకార సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రారెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి,డైరెక్టర్లు షేక్ హసీనా, బిజ్జాల తిరుమలరెడ్డి, గజ్జలకొండ నారాయణ, కొమరోలు మాజీ వార్డ్ మెంబర్ షేక్ సుభాని,కొమరోలు సహకార సంఘం మాజీ చైర్మన్ పులకుర్తి వెంకటేశ్వర్లు, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జీలు పందనబోయిన భూపాల్, ముత్తుముల ఎల్లారెడ్డి,,ఎర్రగుంట్ల రామస్వామి, పులకుర్తి సుబ్బరాయుడు తోపాటు పార్టీ నేతలు మల్లికార్జునరెడ్డి, కరీముల్లా, ఖాజావలి, నక్క శ్రీను, పేరాల లక్ష్మీ నరసయ్య, పెనుగొండ వెంకటరమణ తదితర నేతలు కార్యకర్తలు కొమరోలు ఎంపీడీవో రమేష్ బాబు, ఏవో సయ్యద్ కలియముల్లా ఖాద్రి, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్,, పంచాయతీ రాజ్ డి ఈ సుబ్బారెడ్డి,ఏఈ ఈరయ్య, ఏపిఎం, ఏపీ ఓ మహాలక్ష్మి దేవి, కొమరోలు పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత, స్వర్ణ కొమరోలు కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తదితర అధికారులు స్వర్ణ గ్రామ కార్యాలయాల సిబ్బంది అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు తమ సిబ్బందితో శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పర్యవేక్షించారు.

# బీసీవై పార్టీ కో-కన్వీనర్లకు యాదవ సంఘం ఘన సత్కారం



**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 21**

భారత చైతన్య యోజన పార్టీ (బీసీవై) మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ కో-కన్వీనర్ గా నియమితులైన కనపర్తి బాల గోవింద యాదవ్, ఎర్రగొండపాలెం నియోజకవర్గ కో-కన్వీనర్ గా నియమితులైన గోనుగుంట్ల కళ్యాణ్ రాజు యాదవ్ లను మార్కాపురం జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పి.ఎల్.పి యాదవ్ మాట్లాడుతూ సామాజిక స్పృహతో అన్ని వర్గాల అభిమానాన్ని చూరగొని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదిగి బీసీ వర్గాలతో పాటు మిగతా వర్గాలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని సూచించారు.ఈ సన్మాన కార్యక్రమంలో కాటంరాజు గంగాభవాని దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్రి జన్న వెంకటేశ్వర్లు యాదవ్, ప్రముఖ న్యాయవాది విజయ వర్ధన్ యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పిన్నిక చక్రపాణి యాదవ్, మార్కాపురం జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు బత్తుల పెద్ద అల్లూరయ్య యాదవ్, శ్రీ వెలుగొండ వెంకటేశ్వర స్వామి యాదవ్ అన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి బొరిగొల్ల గాలయ్య యాదవ్, జిల్లా యాదవ సంఘం కార్యదర్శి గుమ్మా రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వెలిగొండ నిర్వాసితుల ఆందోళన ఉద్రిక్తం

## సీపీఎం నేత సోమయ్య అరెస్ట్






**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 21**

స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం వెలిగొండ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వాసితులు వంటావార్పు కార్యక్రమానికి యత్నించారు.ఇళ్ల స్థలాలు, పరిహారం, పునరావాస సౌకర్యాలు వెంటనే కల్పించాలని నినాదాలు చేస్తూ కలెక్టరేట్ ప్రధాన గేటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. వంటావార్పు కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు కలెక్టరేట్ వద్ద భారీగా మోహరించారు.ఈ క్రమంలో ఆందోళనలో ముందుండి నడిపిస్తున్న సీపీఎం నాయకుడు సోమయ్యను పోలీసులు ఈడ్చుకెళ్లి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.సోమయ్య అరెస్ట్ తో కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిర్వాసితులు ఎన్నో ఏళ్లుగా పునరావాసం కోసం ఎదురుచూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# 10వ బ్లాక్ లో అభివృద్ధికి మరో ముందడుగు

## రూ.12 లక్షల సీసీ రోడ్డుకు శంకుస్థాపన

**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 21**

పట్టణంలోని 10వ బ్లాక్ లో అభివృద్ధి పనులకు మరో ముందడుగు పడింది. రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, నాయకులు నాలి కొండయ్య యాదవ్, గఫార్, ఇబ్రహీం, కొప్పుల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, అధికారులు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఎస్పీ హర్షవర్ధన్ రాజును సన్మానించిన టిడిపి నాయకులు




**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 21**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురంలో కొలువైఉన్న ప్రాచీన కామాక్షి సమేత చంద్రమౌళేశ్వర స్వామి దేవస్థానంలో జూలై 8న జరిగిన పంచలోహ విగ్రహాల చోరీ ఘటనను పోలీసులు ఛేదించి, నిందితులను అరెస్టు చేసి విగ్రహాలను స్వాధీనం చేసుకున్న సందర్భముగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం పామూరు సిఐ కార్యాలయమునకు వచ్చిన విషయం తెలుసుకున్న మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో దేవస్థాన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు పోలీసుల దర్యాప్తు ఫలితంగా పంచలోహ విగ్రహాలు చోరీ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజును శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, మన్నేపల్లి శ్రీనివాసులు, మాజీ మండల అధ్యక్షులు పాలుగుళ్ళ వెంకట రెడ్డి, గ్రంధి హేమ సుందరం, మాజీ ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, రేనాటి వెంకటేశ్వర్లు, రాయిని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప మహా అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

**పెద్దదోర్నాల పెన్ పవర్ సెప్టెంబర్ 21**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ మహా అభియాన్'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు.. దేశసేవ కోసం ప్రధాని నరేంద్ర మోడీ తన జీవితాన్ని త్యాగం చేశారని.. ఈరోజు వికసిత భారత్ గా దేశం పయనిస్తుంది అంటే దానికి కారణం మోదీయేనని అన్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి 76వ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెలరోజుల పాటు 'సేవా సంకల్ప అభియాన్' నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజాసేవ, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, రక్తదానం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ వంటి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా సమాజంలోని పేదలు, నిరుపేదలు, వృద్ధులు, మహిళలు, యువత, గిరిజనులు తదితర వర్గాలకు అండగా నిలిచి సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కోరారు.. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో సేవాభావం మరింత బలపడుతుందని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా ప్రజాసేవకు అంకితం చేయడం ఒక్క బీజేపీకే సాధ్యం అని డాక్టర్ ఏలూరి అన్నారు.

# దివ్యాంగులతో డ్వాక్రా గ్రూపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

## నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా

## జిల్లా కలెక్టర్ రాజాబాబును కలిసి వినతి పత్రం అందజేత

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (వెలుగు) ద్వారా దివ్యాంగులకు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి వారికి ఉపాధిని కల్పించాలని ఆదేశాలు ఉన్నా ప్రకాశం జిల్లాలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (వెలుగు), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా నూతన గ్రూపులను కొన్ని సంవత్సరాలుగా ఏర్పాటు చేయటం లేదని విచారించి చర్యలు తీసుకోవాలని కోరిన నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. కాలేషా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రాజా బాబు ని కలిసి ఫిర్యాదు చేశారు. గత కొన్ని ,సంవత్సరాల నుండి నూతన దివ్యాంగుల డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేయలేదని తెలిపారు. అలాగే పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా కూడా స్వయం సహాయక సంఘాల నూతన గ్రూపులను ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రాజెక్టు డైరెక్టర్ లను కోరిన నేటికీ పట్టించుకోలేదని వాపోయారు. జీ.వో. ఎం.ఎస్.నెంబర్. 43 ప్రకారం 5శాతం , రిజర్వేషన్ ఉన్న కూడా అవి అధికారులు పాటించటం లేదని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల గ్రూపులు జిల్లాలో లక్షల్లో ఉన్నా కూడా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను మాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం చర్యలు తీసుకోని దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో ఎం. కృష్ణ, రసూల్ తదితరులు ఉన్నారు.

# నిబంధనలు పాటించని రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

## చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్

## జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిని కలిసి ఫిర్యాదు చేసిన ఆమంచి





**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

చీరాల ప్రాంతంలో అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా లేఅవుట్లు వేసి ఇష్టాను రీతిలో వ్యాపారం చేస్తున్నారని అలాంటి అక్రమ లేఔట్ ల పై ప్రభుత్వ శాఖల అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని చీరాల మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. చీరాల ప్రాంతంలో అక్రమంగా వెలుస్తున్న వెంచర్ల పై ఒనడా వైస్ చైర్మన్, ప్రకాశం జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారిని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. చీరాల నియోజకవర్గ ప్రాంతంలో 1200 ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు వేసి ప్రభుత్వ ఆదాయానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు గండి కొడుతున్నారని ఆమంచి అన్నారు. డి టిసి పి , ఒనడా నిబంధనలు ప్రకారం 10 శాతం భూమిని స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు. 30 శాతం భూమిలో రోడ్ల నిర్మాణం తో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పనకు కేటాయించాలని నిబంధనలు చెబుతున్నాయన్నారు. కొనుగోలుదారుల భవిష్యత్తు అవసరాల కోసం 10 శాతం భూమిని స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.అయితే ఇవన్నీ ఏమీ లేకుండా ఇష్టాన్ని రీతిగా వెంచర్లు వేసి అమ్మకాలు చేస్తున్నారని అన్నారు. ఇలా అక్రమ లేఔట్ లు ఏర్పాటు చేసి అమ్మకాలు జరుపుకొని పోతే తరువాత ఆ లేఔట్లలో మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వానికి కష్టతరమవుతుందని అన్నారు.ఒనడా నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు కేవలం పేరుకే పేపర్ మీద ఉంది తప్ప ఆచరణలో ఎక్కడ నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు ఒక మంచి ఉద్దేశంతో అర్బన్ డెవలప్మెంట్ బాడీలను ఏర్పాటు చేస్తున్నాయని అన్నారు. అయితే ఇక్కడ పెద్ద అవినీతి జరుగుతుందని ఆరోపించారు. అక్రమ లేఅవుట్లను జాయింట్ ఇన్స్పెక్షన్ చేయించి నిబంధన మేరకు స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయించాల్సిన భూములను రిజిస్ట్రేషన్ చేయించడంతోపాటు, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలో ఆ మేరకు నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# శీలంవారిపల్లిలో ఘనంగా గణనాథుని నిమజ్జనం

## భక్తిశ్రద్ధలతో పూజలు కోలాహలంగా శోభాయాత్ర –పోటా పోటీగా సాగిన లడ్డు, కలశం వేలం పాటలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక వాతావరణం మధ్య ఘనంగా ముగిశాయి. గణేశు ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయము సాయంత్రము భక్తులు స్వామివారిని దర్శించుకొని నిత్య పూజలు, అభిషేకాలు, హారతులతో మొక్కులు చెల్లించుకున్నారు చివరి రోజు నిమజ్జన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించి విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు.

**భక్తిశ్రద్ధలతో లడ్డూ, కలశం వేలం**

నిమజ్జనోత్సవం సందర్భంగా గణనాథుని వద్ద స్వామివారి లడ్డూ ప్రసాదం, కలశానికి బహిరంగ వేలంపాట నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొనగా లడ్డూ ప్రసాదాన్ని మునగల వెంకటనారాయణరెడ్డి బ్రదర్స్ రూ. 40 వేలతో దక్కించుకున్నారు. కలశాన్ని గంజెరపల్లి ఆంజనేయులు రూ. 32 వేలకు సొంతం చేసుకున్నారు. లడ్డు కలశం దక్కించుకున్న వారిని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా కత్తులపల్లి వెంకటాద్రి కుమారుడు నారాయణరెడ్డి భక్తులకు పులిహోర, గుగ్గిళ్ల ప్రసాదాలను పంపిణీ చేశారు.లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న మునగల వెంకటనారాయణరెడ్డి మాట్లాడుతూ వినాయకునికి సమర్పించిన దివ్య ప్రసాదం తమకు లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గణనాథుని కృపతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తితో స్వామివారిని కొలిస్తే



విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు.

**కోలాహలంగా గణనాథుని శోభాయాత్ర**

నిమజ్జనం సందర్భంగా గణనాధుని విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్పై ఏర్పాటు చేసి గ్రామంలో భక్తుల కోలాహలం మంగళ వాయిద్యాలు, మేళా తాళాలు, టపాసుల శబ్దాలతో యువత కేరింతల మధ్య డాన్సులతో గణనాధుని శోభాయాత్ర భక్తి పారవశ్యం తో , భక్తులు జయజయ ధ్వానాలు చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నృత్యాలు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది గ్రామంలో ప్రతి ఇంటి ముందు



గణనాథుని విగ్రహమ్ చేరుకున్న సమయంలో మహిళలు భక్తి పూర్వకంగా స్వాగతం పలికి బిందెలతో నీరు వారు పోసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు వినాయకుని నామస్మరణతో వీధులన్నీ మారుమోగిపోయాయ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని సాగనంపుతూ ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భక్తితో గ్రామ ప్రజలు కుటుంబ సుఖసంతోషాలు పాడిపంటలు అభివృద్ధి ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్ధించారు అనంతరం భద్రాయపల్లి సమీపంలోని డొక్కల వాగు వద్దకు చేరుకుని శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుని నిమజ్జనం చేశారు.

# వినాయకుని దర్శించుకున్న బోయళ్ల నారాయణరెడ్డి



**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబరు 21**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం సందుగడ్డలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ మండపాన్ని సోమవారం మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పది వినాయక మండపాల నిర్వాహకులకు ఒక్కో విగ్రహానికి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. లక్ష విరాళాన్ని బోయళ్ల నారాయణరెడ్డి అందజేశారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కమిటీలను అభినందించారు. అనంతరం సందుగడ్డ గణేష్ మండపం నిర్వాహకులు బోయళ్ల నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, మన్నేపల్లి శ్రీనివాసులు, మన్నేపల్లి రవికుమార్, సీనియర్ జర్నలిస్టు సంగిశెట్టి పీరయ్య నాయుడు, గ్రంధి హేమ సుందరం, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, పోకల మాలకొండయ్య, రేనాటి వెంకటేశ్వర్లు, కసీదు నారాయణ, గణేష్ మండపం నిర్వాహకులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# బదిరుల పాఠశాలను సందర్శించిన మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

ఒంగోలు భాగ్యనగర్ లోని బదిరుల ప్రభుత్వ పాఠశాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం పాఠశాల పరిసరాలు, ఆట స్థలం మంత్రి పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతుల విద్యార్థుల విద్య, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆకాంక్షించారు.

# కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో గణపతి నిమజ్జనోత్సవం



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక బొమ్మ ను ఆదివారం రాత్రి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలకరించిన ట్రాక్టర్ మీద గణపతి ఊరేగింపుగా బయలుదేరి విద్యార్థులు సిబ్బంది రంగులు చల్లు కుంటూ బాణాసంచా పేలుళ్ల మధ్య భక్తిపాటలతో కొలహంగా నిమజ్జనం చెశారు.

# నియోజకవర్గ బిసివై పార్టీ ఉపాధ్యక్షునిగా బొరిగొర్ల కొండయ్య యాదవ్

**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 21**



బీసీవై పార్టీ కనిగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా బొరిగొర్ల కొండయ్య యాదవ్ను నియమించారు. పార్టీ అధిష్ఠానం బొరిగొర్ల కొండయ్య యాదవ్ కు కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొరిగొర్ల కొండయ్య యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నియమించిన బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ కు, జిల్లా బీసీవై పార్టీ అధ్యక్షుడు నరేంద్ర బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా క్రమశిక్షణతో పనిచేస్తానన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ బీసీవై పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ ఆదేశించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు పార్టీ విధానాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీ అభివృద్ధికి మరియు విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

# సి ఎస్ పురంలో మండల సర్వసభ్య సమావేశం

## ప్రజా ప్రతినిధులకు సన్మానం



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

తన ఐదేళ్ల పదవీకాలంలో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి కి కృషి చేసినట్లు మండల పరిషత్ అధ్యక్షులు మూఢమంచు వెంకటేశ్వర్లు తెలిపారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పదవీకాలంలో ప్రజా ప్రతినిధులను కానీ అధికారులను కానీ అంకితభావంతో పనిచేసే విధంగా వారికి సూచనలు చేయడం జరిగిందని తెలిపారు మండల పరిషత్ నిధులు మిగిలిపోవడంపై కొందరు సభ్యులు సభలో చర్చించడం జరిగింది . నిధులు అభివృద్ధి కేటాయించకుండా ఎందుకు అలసత్వం చేయడమని ప్రశ్నించారు దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ వీలైనంతవరకు మండల పరిషత్ నిధులను గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేశామని చివరి క్షణంలో వాటిని వినియోగించలేకపోయామని చెప్పారు రాబోయే రోజుల్లో మండల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు ప్రజలు తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చారని వారికి న్యాయం చేసేందుకు కృషి చేసినట్లు అని తెలిపారు సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి సామర్థ్యాలు ఒక ప్రజా ప్రతినిధికి మాత్రమే ఉంటాయని వారు మనకు ఇచ్చినటువంటి వరం ఈ పదవిని తెలియజేశారు రాబోయే రోజుల్లో మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టడం





జరుగుతుందని తెలిపారు జెడ్పిటిసి మేకల శ్రీనివాసులు మాట్లాడుతూ జడ్పీ నిధులు కోటి రూపాయలపైగా వెచ్చించి మండలంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేసినట్లు ఆయన తెలిపారు అరివేముల ఎంపిటిసి సభ్యులు డాక్టర్ బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు బాధ్యతగా పనిచేస్తేనే భవిష్యత్తు ఉంటుందని తెలిపారు మండల పరిషత్ నిధులు సక్రమంగా వినియోగించాక పోవడంతో ఎంపీపీ అలసత్వమే కారణమని చెప్పడంతో దీనిపై ఎంపీపీ స్పందిస్తూ అనేక గ్రామాల్లో మండల పరిషత్ నిధుల ద్వారా అభివృద్ధి చేశామని తెలిపారు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి సహకారంతో రాబోయే రోజుల్లో మండల పరిషత్ నిధులద్వారా అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెంగయ్య తెలిపారు అనంతరం పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా ఎంపిపి మూడమంచి వెంకటేశ్వర్లును రాష్ట్ర కనీస వేతన మండల సలహా సభ్యులు మరియు మండల పరిషత్ ప్రతిపక్ష నేత డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు ఎంపీటీసీ సభ్యులను ఎంపీపీ మూఢమంచు వెంకటేశ్వర్లు సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్ వైస్ ఎంపీపీలు దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి భూమిరెడ్డి ప్రభంజన, ఎంపీటీసీలు మన్నేపల్లి పెద్దన్న, ముడిమాల రాములమ్మ, పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు కొమరోలులో సయ్యద్ మహబూబ్ సుభాని ఖాద్రి షరీఫ్ దర్గాలో ఉరుసు మహోత్సవం

వేలాదిగా తరలిరానున్న భక్తజన సందోహం.

భక్తులకు అన్నదాన కార్యక్రమం తో పాటు గొప్ప కవ్వాలి కార్యక్రమం ఏర్పాటు.

దర్గా, దర్గా ప్రాంగణాన్ని, ఇస్లాంపేట లోని వీధులను తోరణాలతో, రంగురంగుల విద్యుపాలతో అలంకరించిన యువకులు.



**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 21**

కొమరోలు లోని ఇస్లాంపేటలో గల అల్ హజ్ సయ్యద్ మహబూబ్ సుభాని ఖాద్రి షరీఫ్ దర్గాలో మంగళవారం గంధం ఉరుసు ఏ షరీఫ్ వేడుకలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఉరుసు మహోత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతి సంవత్సరం గార్మి మాసంలో కొమరోలు ముస్లిలాంపేటలో గల అల్ హజ్ మహబూబ్ సుభాని దర్గా షరీఫ్ లో గంధం కృషి ఏ షరీఫ్ వేడుకలు అత్యంత వైభవంగా ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించే కార్యక్రమాలు సాంప్రదాయబద్ధంగా సాగుతున్నాయి. కుల మతాలకు రాజకీయాలకు అతీతంగా వేలాది మంది భక్తులు వరుస మహోత్సవ వేడుకలలో పాల్గొని స్వామి వారి మొక్కలు తీర్చుకునే సాంప్రదాయం కొనసాగుతున్నది. అందులో భాగంగా ఈ ఏడాది గ్యార్మి మాసంలో ఉరుసు మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కృషి మహోత్సవ కమిటీ సభ్యులు సోమవారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ సందర్భంగా దర్గాను, దర్గా ప్రాంగణాన్ని,ఇస్లాంపేటలోని వీధులను తోరణాలతో రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.కొమరోలు పట్టణంతోపాటు పరిసర మండలాలు గ్రామాల నుంచి వేలాది మంది కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా భక్తులు తరలి వచ్చి ఉరుసు మహోత్సవ వేడుకల్లో పాల్గొని మొక్కలు తీర్చుకోనున్నారు. వారి



సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదాన సౌకర్యంతో పాటు కవ్వాలి ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం స్వామివారికి గంధాన్ని ప్రత్యేక వాహనంలో అలంకరించి మేళ తాళాలు కనక తప్పెట్లతో దర్గాకు చేర్చి, స్వాములవారికి ఫాతిహాలు సమర్పించనున్నారు . అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటల నుంచి గొప్ప కవ్వాలి ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి మహబూబ్ సుబహాని స్వాముల వారి జండాలను అందంగా అలంకరించి ప్రత్యేక ట్రాక్టర్ పై ఏర్పాటుచేసి కనక తప్పెట్లు, మేళ తాళాలు బాణసంచా కాల్పులతో పట్టణంలోని వీధులలో ఊరేగింపు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం వరకు సాగే ఊరేగింపు అనంతరం స్వామి వారి పవిత్రమైన గంధాన్ని వేడుకలలో పాల్గొన్న భక్తులకు పంపిణీ చేయడంతో పాటు కొమరోలు పట్టణంలోని ముస్లింలకు ఇంటింటికి ప్రసాదాన్ని, పవిత్ర గ్రంధాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కావున కొమరోలు మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో ఉరుసు మహోత్సవంలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేస్తూ స్వాముల వారి కృపకు పాత్రులై మొక్కలు తీర్చుకొని వేడుకలను విజయవంతం చేయాలని. ఉరుసు మహోత్సవ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# నేడు మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు 19వ వర్ధంతి

– నివాళులు అర్పించనున్న మంత్రి కింజరాపు అచ్చంనాయుడు



**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

ప్రకాశం జిల్లా పెద్దాయన, మాజీ మంత్రి స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు 19వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10.15 గంటలకు ఒంగోలు నగరంలోని బాపూజీ కాంప్లెక్స్ వద్ద నున్న దామచర్ల ఆంజనేయులు విగ్రహానికి మంత్రి కింజరాపు అచ్చంనాయుడు గారు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి నివాళులు అర్పిస్తారని ఒంగోలు శాసనసభ్యులు కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, దామచర్ల కుటుంబ అభిమానులు అందరూ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించవలసిందిగా కోరారు.

# పోలీస్ మీ కోసం కార్యక్రమంకు 86 ఫిర్యాదులు



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం ( పిజి ఆర్ఎస్)" ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) యుగంధర్ బాబు, పోలీస్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారులతో పోలీస్ అధికారులు ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను విని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదిదారుల యొక్క సమస్యలను సవివరంగా విని, సానుకూలంగా స్పందించిన అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోని త్వరితగతిన న్యాయం అందిస్తామని భరోసా కల్పించారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో అధికారులు మాట్లాడి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే విచారణ చేపట్టి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు,ఒంగోలు ట్రాఫిక్ సీఐ సి.హెచ్. హాజరత్తయ్య, కొండేపి సీఐ రమణయ్య,అద్దంకి సీఐ మల్లికార్జున రావు, సిబ్బంది పాల్గొన్నారు.


# నేడు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

– ఒంగోలు టౌన్ విద్యుత్ డిఈఈ కేవీ పాండురంగారావు

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో త్ విద్యుత్ మరమ్మత్తుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఒంగోలు టౌన్ డిఈఈ కె.వి పాండురంగారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. మంగళవారం ఉదయం 08.00 గంటల నుండి 01.00 గంటల వరకు, మునిసిపల్ ఆఫీస్, శివాలయం, సివిఎన్ రీడింగ్ రూమ్, కోర్ట్ సెంటర్, సెంట్రల్ కేఫ్ , ఏనుగు చెట్టు, గాంధీ రోడ్డు మొత్తం, పోలేరమ్మ టెంపుల్, బాలాజీ రావు పేట 1,2,3 లైన్లు, ఎన్ఆర్ఐ కాలేజ్ , ఆదిత్య కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, అలాగే లిరాంనగర్ 8 వ లైన్‌లి నుండి రాంనగర్ 14 వ లైన్ తోపాటు డి-మార్ట్ పరిసర ప్రాంతంలో ఉదయం 07.00 గం. నుండి 10.30 విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డి.ఈ.ఈ కె.వి. పాండురంగా రావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# లోకల్ పోల్స్ కు కాంగ్రెస్ రెడీ...



**విజయవాడ, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది. ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

# జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా?



**ఒంగోలు సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక చత్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు. జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకోకూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుకబడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా మారే అవకాశముంది.

# కల్తీ నెయ్యి... అడ్డంగా దొరికినట్టేనా

**తిరుమల, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించిన దర్యాప్తు వివరాలను పట్టుకుని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకే రాజకీయంగా, నైతికంగా తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారుతోంది. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అరెస్ట్ చేసిన ఈడీ.. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి ప్రమాదకర రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. అయితే, ఇందులో జంతు కొవ్వు ప్రస్తావన లేదన్న ఒకే ఒక్క పాయింట్‌ను పట్టుకుని, చూశారా మేం జంతు కొవ్వు వాడలేదు, మాపై తప్పుడు ఆరోపణలు చేశారు అంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకోవడం, ఊరట పొందుతున్నట్లు ప్రకటనలు విడుదల చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. ఈ రకమైన సమర్థన ద్వారా ఐదేళ్ల తమ హయాంలో తిరుమలకు నకిలీ, విష రసాయనాల నెయ్యి సరఫరా జరిగిందన్న దారుణ సత్యాన్ని వైఎస్సార్‌సీపీ పరోక్షంగా నూటికి నూరు శాతం అధికారికంగా అంగీకరించినట్లయింది. ప్రాథమికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేది ఒక ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ మాత్రమే. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలో అక్రమ నగదు లావాదేవీలు, డొల్ల కంపెనీలు, కల్తీ సరుకు కొనుగోళ్ల ముసుగులో జరిగిన నిధుల మళ్లింపును నిగ్గుతేల్చడమే దాని పని. నెయ్యిలో జంతు కొవ్వు ఉందా, లేదా అనేది తేల్చాల్సింది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ , ప్రత్యేక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు, కోర్టు పరిధిలోని సిట్ దర్యాప్తు మాత్రమే తప్ప, అది ఈడీ పరిధిలోని అంశం కాదు. అలాంటప్పుడు ఈడీ రిపోర్టులో జంతు కొవ్వు పేరు రాలేదని సంబరాలు చేసుకోవడం ప్రజల దృష్టిని మళ్లించే కుట్రే. ఈడీ మోపిన 230 కోట్ల అక్రమ దందా, ఫేక్ రికార్డులు, విషపూరిత కెమికల్స్‌తో కూడిన తయారీ ఆరోపణలను వైసీపీ పూర్తిగా ఒప్పేసుకున్నట్లే అవుతోంది. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో తిరుమల వేంకటేశ్వర స్వామికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. దేశవిదేశాల నుంచి కోట్ల మంది భక్తులు పరమ భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యి స్థానంలో రీఫైన్డ్ పామాయిల్, మోనోగ్లిజరైడ్స్ వంటి పారిశ్రామిక రసాయనాలను కలిపి అంటగట్టడం కలియుగ దైవానికి చేసిన క్షమించరాని మహాపచారం కాదా? మేము విష రసాయనాలు మాత్రమే వాడాము తప్ప జంతు కొవ్వు వాడలేదని వాదించడం ఎంతటి దిగజారుడుతనం? కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు, అది ఏ రూపంలో ఉన్నా భక్తుల మనోభావాలను, దైవ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీసిన ఘోర నేరమే అవుతుంది. మనీలాండరింగ్ కోణంలో 230 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో 96 కోట్ల విలువైన కల్తీ రసాయన నెయ్యి ఒక్క కంపెనీ నుంచే సరఫరా అయిందని ఈడీ తేల్చింది. పాల సేకరణే లేని ఫ్యాక్టరీల నుంచి ట్యాంకర్ల కొద్దీ కెమికల్ లిక్విడ్ తిరుమల కొండపైకి చేరుతుంటే అప్పటి పాలకమండలి పెద్దలు ఏం చేస్తున్నారు? ఈ అక్రమ రవాణాలో టీటీడీ అధికారులకు, రాజకీయ పెద్దలకు అందిన ముడుపుల మాటేమిటి? శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ ముఠాకు చట్టపరంగా పడే సాధారణ శిక్షలు సరిపోవు.

రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం ఏకంగా రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించిది. ఇది కేవలం వ్యాపారుల స్వార్థం మాత్రమే ఉందంటే సామాన్యులు కూడా నమ్మే పరిస్థితి లేదు. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, భోలే బాబా డెయిరీ విపిన్ జైన్ వంటి వ్యాపారులు నెయ్యి స్థానంలో పామాయిల్, కెమికల్స్ కలిపారన్నది సాంకేతిక ఆధారాలతో తేలింది. కానీ, నిత్యం కఠిన నిబంధనలు, ల్యాబ్ టెస్టులు, సెక్యూరిటీ ఉండే తిరుమల వంటి పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలోకి ఏళ్ల తరబడి ఎలాంటి అడ్డంకులు లేకుండా ట్యాంకర్ల కొద్దీ విషపూరిత నెయ్యి ప్రవేశించిందంటే.. కచ్చితంగా త్యున్నత రాజకీయ అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యే పనేనా ?ఈ ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తోంది టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కడూరు చిన్న అప్పన్న వ్యవహారం. నెయ్యి సరఫరా చేసే డెయిరీ కాంట్రాక్టర్ల వద్ద కిలో నెయ్యికి 25 చొప్పున కమీషన్ డిమాండ్ చేశారన్న అభియోగాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం అప్పన్నను ఏ-24గా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన డెయిరీలను నిబంధనల పేరుతో బెదిరించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించడం, కమీషన్లు ముట్టజెప్పిన కంపెనీలకు రేట్లు పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టడం, హవాలా ద్వారా కోట్లాది రూపాయల ముడుపులు అందుకోవడం వంటి అంశాలపై సిట్ ఆధారాలు సేకరించింది. పూరి గుడిసె నేపథ్యం ఉన్న ఒక సాధారణ పీఏ ఖాతాల్లోకి, బినామీ ఆస్తుల్లోకి కోట్ల రూపాయల నిధులు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో అసలు గుట్టును బయటపెడుతోంది.

**చైర్మన్ పీఏ ... చైర్మన్ చెప్పకుండా చేయగలడా?**

అయితే ఇక్కడే అసలైన రాజకీయ, పరిపాలనాపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక చైర్మన్ పీఏ స్థాయి వ్యక్తి ఇంతటి మెగా కుంభకోణాన్ని సొంత పూచీకత్తుతో నడిపించగలడా? డెయిరీలను బెదిరించడం, టీటీడీ కొనుగోలు విభాగం అధికారులను ఆదేశించడం, టెండర్లలో నిబంధనలు మార్చేలా ఒత్తిడి తేవడం ఆయన ఒక్కడి వల్లే అయ్యే పనేనా? వైవీ సుబ్బారెడ్డి పేరును, ఆయన అధికారాన్ని వాడుకోకుండా బోర్డు పరిధిలోని వ్యవహారాలను ఒక పీఏ శాసించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం. గతంలో కల్తీ గురించి ఫిర్యాదులు, ల్యాబ్ నివేదికలు వచ్చినా బుట్టదాఖలు కావడం వెనుక తిరుమల పాలకమండలి పెద్దల మౌనమే రక్షణ కవచంగా నిలిచిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ప్రస్తుతం సిట్ అప్పన్నను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈడీ మాత్రం కైలాష్ మంగ్లా, విపిన్ జైన్ వంటి తయారీదారులను అరెస్ట్ చేస్తూ పీఎంఎల్ఏ చట్టం కింద మనీ ట్రయల్ ను ఛేదిస్తోంది. కల్తీ నెయ్యి వ్యాపారులు సృష్టించిన నల్లధనం ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఎవరికి కమీషన్లుగా ముట్టింది అనే బ్యాంకింగ్, హవాలా లింకులు బయటకు వస్తే.. ఆ దర్యాప్తు ముగింపు అప్పన్న వద్దే ఆగిపోవడం అసాధ్యం. అప్పన్న ద్వారా ఆ ముడుపులు ఎవరి గడప దాటాయి, టీటీడీ అప్పటి ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ కార్యాలయానికి దీనితో ఉన్న లంకె ఏమిటన్నది తేలక తప్పదు.

# ప్రజల ముందే తేల్చుకుందాం రా..!

**- ఎమ్మెల్యే కందులకు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు బహిరంగ సవాల్**

**- ప్రెస్ మీట్ల పేరుతో ఇద్దరం చులకన కావొద్దు**

**- ప్రజాక్షేత్రంలోకి వెళ్దాం.. ప్రజలనే అడుగుదాం**



**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 21**

మార్కాపురం రాజకీయం మళ్లీ వేడెక్కింది. ఆదివారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నిర్వహించిన ప్రెస్ మీట్ కు కౌంటర్ గా సోమవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇంచార్జి అన్నా రాంబాబు ఒక వీడియోను విడుదల చేశారు. రాజకీయ విమర్శలు ఒకరిపై ఒకరు ప్రెస్ మీట్లు పెట్టి చేసుకోవడం వల్ల నాయకులుగా మనం ప్రజల వద్ద చులకన అయిపోతున్నామని తనకు ఇష్టం లేదని అన్నా రాంబాబు పేర్కొన్నారు. అందుకే ఇద్దరం కలిసి నేరుగా ప్రజల్లోకి వెళ్లి ప్రజాభిప్రాయాన్ని, ప్రజాశక్తి ఏంటో తెలుసుకుందాం రా అంటూ ఎమ్మెల్యే కందులకు బహిరంగ సవాల్ విసిరారు.

**వెన్నుపోటు పార్టీ ఎవరిదో ప్రజలే తేలుస్తారు..**

తనపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందిస్తూ మీ పార్టీ వెన్నుపోటు పార్టీయా, మా పార్టీ వెన్నుపోటు పార్టీయా అనేది మనం మాట్లాడుకోవడం కాదు, నేరుగా ప్రజల దగ్గరకు వెళ్లి అడిగి తెలుసుకుందామని అన్నారు. చరిత్రలో ఎవరు ఎవరికి వెన్నుపోటు పొడిచారో ప్రజలకు అంతా తెలుసు అని ఎద్దేవా చేశారు.

**మేనిఫెస్టోల అమలుపై ప్రజా తీర్పుకు సిద్ధమా..?..:** ఈ సందర్భంగా రెండు పార్టీల మేనిఫెస్టోల అమలుపై చర్చకు రావాలని కోరారు. మా నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఎక్కడైనా మాట తప్పాడా? అదే విధంగా 2024 ఎన్నికల ముందు మీ పార్టీ, మీ కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాలు సహా ఇతర హామీలను అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో నెరవేర్చారా లేదా అనేది ప్రజల ముందే తేల్చుకుందామని సవాల్ చేశారు.

**నేను మాట్లాడింది కోవర్టుల గురించే..:** 2024 ఎన్నికల్లో తనకు ద్రోహం చేసిన కొంతమంది కోవర్టులను ఉద్దేశించి తాను ఇటీవల జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడానని, అది పార్టీలోని అందరినీ ఉద్దేశించి కాదని అన్నా రాంబాబు స్పష్టం చేశారు. నాకు ఎవరెవరు ద్రోహం చేశారో నాకు కొంత మాత్రమే తెలుసు, కానీ నీకు మొత్తం తెలుసు అంటూ ఎమ్మెల్యే కందులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ కోవర్టులు ఎవరో, వారితో ఎవరు టచ్ లో ఉన్నారో నీకు బాగా తెలుసని పరోక్షంగా విమర్శించారు.

**ముందు నీ సంగతి తెలుసుకో..:** ఇతరుల గురించి మాట్లాడే ముందు నీ పార్టీ నాయకులే నీ గురించి ఏం మాట్లాడుకుంటున్నారో, నీ వెనుక ఎలాంటి విమర్శలు చేస్తున్నారో తెలుసుకోవాలని ఎమ్మెల్యే కందులకు అన్నా రాంబాబు హితవు పలికారు.

**వెలిగొండ విషయంలో నీ పాత్ర ఏంటి..?..:** నేనే వెలిగొండ ప్రాజెక్టు తెచ్చానని, ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుండి దాని కోసం పోరాడుతున్నానని ఎమ్మెల్యే కందుల చెప్పుకుంటున్నారని, అయితే 30 సంవత్సరాల్లో మీ తెలుగుదేశం పార్టీ ఎన్ని సంవత్సరాలు అధికారంలో ఉందో, అప్పుడు ఎందుకు వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు చేయనిది ఇప్పుడు ప్రతిపక్షంపై నెపం వేయడం సరికాదన్నారు.

# పేదల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి - సిపిఎం డిమాండ్

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**






ఒంగోలు నగరంలోని అర్హులైన 20,800 మంది పేదలకు ఒక్కొక్కరికి రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. 2018లో ప్రారంభించిన టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు వెంటనే అందించాలని కోరింది. సిపిఎం ఒంగోలు నగర పార్టీ జనరల్‌బాడీ సమావేశం సోమవారం సుందరయ్య భవన్‌లో నగర కార్యదర్శివర్గ సభ్యులు తంబి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ ఒంగోలు కార్పొరేషన్ గా ఏర్పడి 12 ఏళ్లు గడిచినా పేదల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం వెంగముక్కలపాలెం -- అగ్రహారం ప్రాంతంలో భూముల కొనుగోలుకు సుమారు రూ.250 కోట్లు ఖర్చు చేసినా, అర్హులకు పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిరోజూ రక్షిత మంచినీరు ఇస్తామని హామీ ఇచ్చినా మూడు రోజులకు ఒకసారి కూడా సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారని అన్నారు. అమృత్--2 పథకం నిధులతో అదనపు పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, సమ్మర్ స్టోరేజీలు నిర్మిస్తామని చెప్పినా పనులు ముందుకు సాగలేదన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా కాలనీ ప్రజల దాహార్తి తీరడం లేదన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, బ్యాంకు రుణాలు చెల్లించలేక ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. నగరంలో డ్రైనేజీ, ముంపు, ట్రాఫిక్, పార్కులు, రోడ్లు, దళితవాడల మౌలిక వసతులు, స్మశానవాటికల అభివృద్ధిపై పాలకులు దృష్టి పెట్టాలని కోరారు. ఆస్తిపన్ను భారాన్ని తగ్గించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నగర సమస్యలపై సమగ్ర ప్రణాళిక రూపొందించి పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. సమావేశంలో జి.రమేష్, ఎన్.వీరాస్వామి, జి.శ్రీనివాసులు, బి.వి.రావు, ఆదిలక్ష్మి, ధార వెంకటేశ్వర్లు, ఎస్.డి. హుస్సేన్, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కవి గురజాడకు ఘన నివాళులు



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**


ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో సోమవారం ప్రముఖ రచయిత, కవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సాంస్కృతిక శాఖ చైర్పర్సన్ తేజస్విని ,జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

# మై హూ నా... మై సున్ రహా హూ.. (నేను ఉన్నాను... నేను వింటున్నాను) అంటూ ముస్లిం మహిళలతో ఉర్దూలో మాట్లాడి ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

### అర్హులైన పేదలందరికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక నూతన పెన్షన్లు మంజూరు -అక్టోబర్ ఒకటో తేదీ నుంచి నూతన పెన్షన్లు అమలు

### అపోహలు, అసత్యప్రచారలు నమ్ముతూ ఆందోళన చెందవద్దు -పెన్షన్ దరఖాస్తుదారులకు గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి హామీ సూచనలు సలహాలు





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 21.**

మై హు నా...మై సున్ రహా హు...నేను ఉన్నాను...నేను వింటున్నాను...అంటూ గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కొమరోలు లోని ముస్లిం మహిళలతో ఉర్దూలో మాట్లాడుతూ వారిని ఉత్సాహపరిచారు. గిద్దలూరు శాసనసభ్యులు సోమవారం మండల కేంద్రమైన కొమరోలు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు.ఆ సందర్భంగా ఇస్లాంపేటలోని గుట్ట వద్ద ఏర్పాటుచేసిన నూతన సిమెంట్ రోడ్డు శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించి నూతన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఆ సందర్భంగా అక్కడికి చేరుకున్న ముస్లిం మహిళలను ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆప్యాయతగా పేరుపేరునా పలకరిస్తూ, వారితో స్వచ్ఛమైన ఉర్దూలో మాట్లాడారు. దీనితో ముస్లిం మహిళలతో పాటు ముస్లిమేతర మహిళలు కూడా హర్షం వ్యక్తం చేస్తూ అశోక్ రెడ్డిచెప్పే మాటలను, సూచనలు సలహాలను ఓపికగా విన్నారు. తాము వృద్ధాప్యపు, వితంతువు, వికలాంగుల పెన్షన్ల కొరకు దరఖాస్తులు చేసుకున్నామని, అందువల్ల తమకు ఎన్టీఆర్ భరోసా నూతన పెన్షన్లు మంజూరు చేయించాలని మహిళలు అశోక్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆ సందర్భంగా ఆయన ముస్లిం మహిళలతో స్వచ్ఛమైన ఉర్దూలో మాట్లాడుతూ, వారి వద్ద ఉన్న ఆధార్ కార్డులను పరిశీలిస్తూ, మై హూ నా... మై సున్ రహా హూ...నేను ఉన్నాను.. నేను వింటున్నాను..అంటూ మహిళలు చెప్పే సమస్యలను ఓపికగా విని వారికి సమాధానాలు చెప్పి ఉత్సాహపరిచారు. అర్హులైన పేదలందరికీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు మంజూరు అవుతాయని, అక్టోబర్ ఒకటో తేదీ నుంచి నూతన పెన్షన్లను పొందవచ్చని ఆయన తెలిపారు. అపోహలు, అసత్య ప్రచారాలు, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు హామీలన్నింటినీ నెరవేరుస్తూ వస్తున్నారని, అయితే గత వైసిపి ప్రభుత్వం సాగించిన విధ్వంసక పాలన వల్ల రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారి నీరుగారిపోయాయని అన్నారు. వాటిని అన్నింటిని గాడిలో పెట్టి ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాల వలన నూతన పెన్షన్లు మంజూరు కొంత ఆలస్యం జరిగిందని అందువల్ల అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త పెన్షన్లను పొంది సద్వినియోగం చేసుకోవాలని ఆయన దరఖాస్తుదారులకు విజ్ఞప్తి చేశారు. తాను గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధితో పాటు కొమరోలు మండల అభివృద్ధికి,ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నానని, ఎలాంటి సమస్యలు ఎదురైనా కొమరోలు లో ఉండే నా సోదరుడు ముత్తుముల సంజీవరెడ్డికి వివరించి వాటి పరిష్కారానికి తమకు సహకరించాలని అశోక్ రెడ్డి ప్రజలను కోరారు. కొమరోలు మండలంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందు జాగ్రత్తగా చర్యగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవల కొమరోలు గ్రామపంచాయతీకి నూతనంగా 5 విద్యుత్ బోర్లు మంజూరయ్యాయని వాటిని అవసరం ఉన్న గ్రామాలలో త్వరలో ఏర్పాటుచేసి ప్రజలకు నీటి ఎద్దడి సమస్య లేకుండా కృషి చేస్తామని ఆయన వివరించారు. కొమరోలు మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ ఖాదర్ సర్పంచిగా పనిచేసిన కాలంలో కొమరోలు జరిగిన అభివృద్ధి, ప్రజా సంక్షేమం గురించి వివరిస్తూ ప్రజలకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గుర్తు చేశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తో పాటు కొమరోలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి కొమరోలు మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ ఖాదర్ నేతలను ముస్లింలు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఆ కార్యక్రమంలో కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, కొమరోలు మాజీ సర్పంచ్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఎడమ కళ్ళు సహకార సంఘం చైర్ పర్సన్ బిజ్జం రవీంద్రారెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, డైరెక్టర్లు షేక్ హసీనా, బిజ్జాల తిరుమల్ రెడ్డి, గజ్జలకొండ నారాయణ, కొమరోలు మాజీ వార్డ్ మెంబర్ షేక్ సుభాని, తెలుగుదేశం పార్టీ నేతలు మల్లికార్జున్ రెడ్డి,కరీముల్లా, ఖాజావలి, ఎంపీడీవో రమేష్ బాబు మండల పరిషత్ ఏవో సయ్యద్ ఖాలీముల్లా ఖాద్రి, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ డిఈ సుబ్బారెడ్డి,ఏఈ ఈరయ్య, ఏపీఎం విద్యాసాగర్,ఏపీవో, మహాలక్ష్మి దేవి, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి,విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు, కొమరోలు పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత, స్వర్ణ కొమరోలు కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి, పలువురు అధికారులు స్వర్ణ గ్రామ కార్యాలయాల సిబ్బంది తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కొమరోలు పర్యటన సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పరివేక్షించారు.

## ఒంగోలులో టీడీపీ పార్లమెంట్ కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలించిన మంత్రి డా.స్వామి





**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

ఒంగోలులో నిర్మాణంలో ఉన్న తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ పార్టీ కార్యాలయ నిర్మాణ పనులను సోమవారం నాడు రాష్ట్ర మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించిన మంత్రి, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనుల వివరాలను సంబంధిత ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ నిర్మాణంలో చేపడుతున్న వివిధ పనులు, మౌలిక వసతుల ఏర్పాట్లు, కార్యాలయ వినియోగానికి అనుగుణంగా చేపడుతున్న నిర్మాణ ప్రణాళిక తదితర అంశాలపై చర్చించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... కార్యకర్తలకు అందుబాటులో ఉండే విధంగా పార్టీ కార్యాలయాన్ని తీర్చిదిద్దడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత సమన్వయంతో నిర్వహించేందుకు అవసరమైన వసతులు కల్పించడంపై దృష్టి సారించామన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు కార్యాలయం ఒక సమన్వయ వేదికగా నిలుస్తుందని, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి మరింత ముందుగానే కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి కొరాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## వినాయక సన్నిధిలో మన్నేపల్లి కార్తీక్



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సి ఎస్ పురం లో సోమవారం మండల తెలుగు యువత నాయకులు మన్నేపల్లి కార్తీక్ వినాయక మండపమును దర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ కమిటీ నిర్వాహకులు మన్నేపల్లి కార్తీక్ ను ఘనంగా సత్కరించారు.

# మాలకొండలో గేట్లు మూసి అవమానిస్తారా?

# ఇదేనా మీ సంస్కారం!

### -ఎమ్మెల్యే తీరుపై ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ తూమాటి మాధవరావు తీవ్ర విమర్శలు

### -అభివృద్ధి అంతా నేనే చేశాననడం అజ్ఞానం -గత పాలకుల కృషిని విస్మరించొద్దు

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 21**

మాలకొండ దర్శనానికి వెళ్లిన సమయంలో గేట్లు తెరవకుండా తనను అవమానించారని ముందుగానే ఈఓకు సమాచారం ఇచ్చినప్పటికీ, ఈఓను ఎమ్మెల్యే రానివ్వకుండా బెదిరించారని ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ తూమాటి మాధవరావు ఆరోపించారు. సోమవారం తన నివాసంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన పలు రాజకీయ, అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. లిమాలకొండ ఆలయ అభివృద్ధిలో నా పాత్ర ఉందిలి. మాలకొండ ఆలయ గోపుర నిర్మాణం చేపట్టే అవకాశం స్వామివారు తనకు కల్పించారని మాధవరావు తెలిపారు. తాను రాష్ట్ర ప్రోటోకాల్‌లో నాలుగో స్థానంలో ఉన్న వ్యక్తినని, అలాంటి తనకే గేట్లు మూసివేస్తే బయట నుంచి వచ్చే భక్తులు, ప్రముఖులను ఏ విధంగా గౌరవిస్తున్నారో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు.టీడీపీ నాయకుల సహకారాన్ని పొందిన అనంతరం స్థానిక ఎన్నికల్లో వారికే వ్యతిరేకంగా వ్యవహరిస్తే, పార్టీ కార్యాలయానికి రానివ్వనని చెప్పడం సరైన విధానం కాదన్నారు. ఎన్నికలంటే భయపడుతున్నారనే భావన కలుగుతోందని విమర్శించారు.

**నా రాజకీయ ప్రస్థానంపై అవగాహన పెంచుకోవాలి...**

తాను సర్పంచ్‌గా పోటీ చేశానని కొందరు చేస్తున్న వ్యాఖ్యలను మాధవరావు ఖండించారు. తన తొలి నామినేషన్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి దాఖలు చేశానని తెలిపారు. ఎమ్మెల్సీగా, శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయాన్ని గుర్తుచేశారు. గెలుపు, ఓటములు రాజకీయాల్లో సహజమని, ప్రతి ఎన్నికకు ప్రత్యేక పరిస్థితులు ఉంటాయని అన్నారు. వ్యక్తిగత విమర్శలకు బదులుగా రాజకీయ అవగాహన పెంచుకోవాలని సూచించారు.

**రాళ్లపాడు మరమ్మతులు, కరేడు రైతుల సమస్యలపై ప్రస్తావన**

రాళ్లపాడు ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు తన స్నేహితుల సహకారంతో పనులు చేయించానని మాధవరావు పేర్కొన్నారు. కరేడు గ్రామంలో ఇండోసోల్ భూసేకరణ సందర్భంగా రైతులకు అన్యాయం జరుగుతున్నప్పటికీ సంబంధిత వ్యక్తులు స్పందించలేదని విమర్శించారు. తాము పోరాటం చేసి పరిహారం పెంపునకు కృషి చేశామని, రూ.12.50 లక్షల నుంచి రూ.20 లక్షలకు పరిహారం ఇప్పించామని తెలిపారు.కందుకూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చిన సందర్భంలో ప్రస్తావించాల్సిన సమస్యలపై తాను సూచనలు ఇచ్చానని, తాను చెప్పిన అంశాలనే అడిగారని మాధవరావు గుర్తుచేశారు. అలాగే జగన్ కావలికి వచ్చినప్పుడు 22-ఏ భూముల సమస్యను వివరించగా, దానిని తొలగించే చర్యలు జరిగాయని అన్నారు.

**కందుకూరు అభివృద్ధి ఒక్కరి ఘనత కాదు...**

కందుకూరు అభివృద్ధికి గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలందరి కృషి ఉందని మాధవరావు అన్నారు. 75 సంవత్సరాలుగా కందుకూరులో ఏ ఎమ్మెల్యే అభివృద్ధి చేయలేదని, అంతా తానే చేశానని చెప్పుకోవడం అజ్ఞానమని విమర్శించారు. దివి శివరాం కందుకూరు ఏరియా వైద్యశాల, రాళ్లపాడు ప్రాజెక్టు నూతన గేట్లు, పలు రహదారుల నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. మానుగుంట మహీధర్ రెడ్డి సోమశిల జలాలు, రామతీర్థం నుంచి కందుకూరుకు తీసుకురావడం, రోడ్లు, వంతెనల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. ఇతర అభివృద్ధి



పనులులి: సింగరాయకొండ నుంచి మాలకొండ వరకు హైవే, రామాయపట్నం పోర్టు, విక్కిరాలపేట డబుల్ రోడ్డు వంటి ప్రాజెక్టులు తమ ప్రభుత్వ కృషి ఫలితమని మాధవరావు తెలిపారు.కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంఐజీ ఆదాయం వినియోగించేలా జీవో తీసుకురావడంలో మహీధర్ రెడ్డి పాత్ర ఉందని చెప్పారు.

**మున్సిపల్ ఎన్నికలకు ఎందుకు వెనుకడుగు?...**

విలీన గ్రామాలను పక్కనపెట్టి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని మాధవరావు ప్రశ్నించారు. ఎన్నికల విషయంలో భయపడుతున్నారనే విమర్శలు చేశారు.దాసరి మాల్యాద్రిపై కేసులు పెట్టించడం, కాల్‌మనీ కేసుల అంశంలో తనపై వచ్చిన ఆరోపణలను ఆయన ప్రస్తావించారు. ఈ విషయంలో తాను చేసిన ఆరోపణలను నిరూపించేందుకు అంకమ్మ గుడిలో ప్రమాణం చేయడానికి సిద్ధమని సవాల్ విసిరారు.

**అక్రమ కేసులు పెడితే అధికారులూ మూల్యం చెల్లించుకోవాలి...**

అక్రమ కేసులు బనాయిస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని మాధవరావు హెచ్చరించారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు అనుగుణంగా పోలీసులు, అధికారులు అక్రమ కేసులు నమోదు చేస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తూ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు తామే ఇస్తున్నామని ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో తాను, మహీధర్ రెడ్డి అనేకమందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఇప్పించినప్పటికీ వాటిని ప్రచారం చేసుకోలేదన్నారు.

**కమిషన్ల ఆరోపణలపై తీవ్ర వ్యాఖ్యలు...**

కందుకూరులో రేషన్ షాపులు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, పేకాట, గంజాయి, పశువుల రవాణా, రియల్ ఎస్టేట్ వెంచర్లకు సంబంధించి కమిషన్లు వసూలు చేస్తున్నారంటూ మాధవరావు పలు ఆరోపణలు చేశారు. వెంచర్ల విషయంలో ఎకరాకు రూ.5 లక్షల వరకు కమిషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు.టీటీడీ లేఖలను డబ్బులకు విక్రయించారనే ఆరోపణకు తన వద్ద సాక్ష్యాలు ఉన్నాయని తెలిపారు.

**2029లో రాజకీయంగా సమాధానం చెబుతా...**

ప్రజలు తమను కమిషన్లు వసూలు చేసుకోవడానికే ఎన్నుకున్నారా అని మాధవరావు ప్రశ్నించారు. 2029లో సంస్కారవంతమైన రాజకీయాలతో ప్రత్యర్థుల తీరుకు సమాధానం చెబుతానని అన్నారు.

# ఆర్అండ్ఆర్ ప్యాకేజీని తక్షణమే అమలు చేయాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

తమకు పరిహారం ఇవ్వాలని కోరుతూ నిరసన తెలియజేస్తున్న వెలిగొండ నిర్వాసితులపై పోలీసులు దాడి చేయడం సరికాదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద శాంతియుతం గా ఆందోళన చేస్తున్న వెలుగొండ



నిర్వాసితులపై పోలీసులు దాడి చేసి సిపిఎం పార్టీ నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. వెలిగొండ నిర్వాసితులకు న్యాయబద్ధంగా రావాల్సిన పరిహారం చెల్లించకపోగా నిరసన వారిపై దాడి చేయడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. వెలుగొండ నిర్వాసితులకు వెంటనే ఇళ్ల స్థలాలు, పరిహారం ఇవ్వాలని పునరావాస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### 'మీకోసం' వినతుల పరిష్కారానికి

# అత్యున్నత ప్రాధాన్యం

**అధికారులకు ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఆదేశాలు**

**ఉదయం నిర్వహించిన గ్రీవెన్స్ కు 397, మధ్యాహ్నం నిర్వహించిన ఎస్సీ,ఎస్టీ గ్రీవెన్స్ కు 61 అర్జీల నమోదు**

**- నేడు ఉదయం అద్దంకి నియోజకవర్గం కొరిశపాడు మండలం మేదరమెట్ల లో పిజి ఆర్ఎస్**



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 21**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' (పిజి ఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీకి అత్యున్నత ప్రాధాన్యమిచ్చి, వేగవంతంగా, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ పి. వెంకటరమణ, ఎస్డిసి మాధురితో కలిసి ఆయన ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ఉదయం నిర్వహించిన సాధారణ గ్రీవెన్స్ లో 397 అర్జీలు, మధ్యాహ్నం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్ లో 61 అర్జీలు కలిపి మొత్తం 458 అర్జీలు నమోదయ్యాయన్నారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వస్తున్న వినతుల పట్ల అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రతను స్వయంగా పరిశీలించి, వాటిని త్వరితగతిన గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను కేవలం సాంకేతికంగా ముగించడం ( రిజెక్షన్) కాకుండా, ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితిలోగా (ఎస్ఎల్ఎ) నాణ్యమైన, సహేతుకమైన పరిష్కారం చూపాలని తేల్చిచెప్పారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల తమ స్థాయిలో పరిష్కరించలేని పరిస్థితి ఉంటే, దానికి గల స్పష్టమైన కారణాలను అర్జీదారులకు వివరించి అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకించి సోమవారం జిల్లా వ్యాప్తంగా 28 గ్రామాల్లో అధికారులు నేరుగా పర్యటించి అక్కడి సమస్యలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇలా గ్రామాల చివరి సరిహద్దుల్లో (ఎండ్ ఆఫ్ విలేజెస్) ప్రజలు ఏమేమి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలుసుకుని, క్షేత్రస్థాయిలోనే వాటిని పరిష్కరించేలా అధికారులు చొరవ చూపడం వల్ల ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఒక మంచి సానుకూల అభిప్రాయం ఏర్పడుతుందన్నారు. గతవారంతో పోలిస్తే ఈసారి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చిందని, వచ్చే వారం నాటికి ఇది ఇంకా మెరుగవ్వాలని ఆకాంక్షించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఎలా పనిచేస్తున్నారో మైక్రో లెవెల్ లో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ 28 గ్రామాల్లో గుర్తించిన సమస్యల పూర్తి వివరాలను అధికారులు ఎక్సెల్ షీట్ లో నమోదు చేసి తమకు పంపాలని ఆదేశించారు. సర్వేయర్ల పనితీరు, ప్రవర్తనలో మార్పు రావాలని కలెక్టర్ సూచించారు. క్షేత్ర స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పనిచేసి సమస్యలు పరిష్కరించడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్ కు క్రమంగా అర్జీల సంఖ్య తగ్గాలని, అంటే క్షేత్ర స్థాయిలో నిరంతరం సమస్యలు పరిష్కారమయ్యే వాతావరణం రావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐ.వి.ఆర్.ఎస్. ఫోన్ కాల్స్ సర్వేలో ప్రజల నుంచి అత్యుత్తమ సానుకూల అభిప్రాయం లభించేలా అధికారులు చురుగ్గా పనిచేయాలని, రీ-ఓపెన్ అయ్యే అర్జీలను ప్రత్యేకంగా సమీక్షించి సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని తెలిపారు.

**మంగళవారం మేదరమెట్లలో గ్రీవెన్స్**

మంగళవారం (రేపు) అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు మండలం, మేదరమెట్లలో 'మీకోసం' (పిజి ఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అక్కడికి వచ్చే అర్జీలలో తక్షణమే పరిష్కరించదగిన వాటిని వెంటనే పరిష్కరించాలని, ఆలస్యమయ్యే లేదా పరిష్కరించలేని అర్జీల విషయంలో అర్జీదారులకు స్పష్టమైన కారణాలను వివరించి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com